PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 333 | విజయవాడ, శనివారం 5 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 5 July 2025 | Rs

కుంభకోణాల ఊబిలో వైద్య విద్య

- కేంద్ర దర్యాప్తు సంస్థ కూపీలో వెలుగులోకి ..ఎఫ్ఐఆర్ నమోదు
- యుజిసి మాజీ ఛైర్మన్ సహా ఉన్నతాధికారులపై కేసు

7



ఇంగ్లండ్‌ను కూల్చిన సిరాజ్

- ఆరు వికెట్లతో సత్తా చాటిన హైదరాబాదీ పేసర్
- బ్రూక్, స్మిత్ భారీ శతకాలు

8



భారత మార్కెట్లకు అమెరికా సంస్థ టోకరా

లొసుగులు వాడుకొని రూ.43వేల కోట్లు కొల్లగొట్టారు • ఎట్టకేలకు జెన్ స్ట్రీట్‌పై సెబీ నిషేధం

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లలోని లొసుగులు వాడుకొని అమెరికా ట్రేడింగ్ సంస్థ జెన్ స్ట్రీట్ భారత మార్కెట్లో భారీ మొత్తాన్ని కొల్లగొట్టింది. ఎట్టకేలకు ఇది బయట పడటంతో ఆ సంస్థ భారత మార్కెట్లలో పాల్గొనకుండా సెబీ నిషేధం విధించింది. జెన్‌స్ట్రీట్ సంపాదించిన లాభం మొత్తాన్ని ఎస్క్రో అకౌంట్స్‌లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా క్యాష్ మార్కెట్లలో షేర్ల ధర స్వల్ప పెరుగుదల కూడా షేరు ఆప్షన్స్‌పై ఎక్కువ ప్రభావం చూపుతుంది.

అదే విధంగా మార్కెట్ సూచీల్లో భాగమైన షేర్ల ధరలు క్యాష్, ఫ్యూచర్స్‌లో పెరిగినా లేదా తగ్గినా సదరు ఇండెక్స్ ఆప్షన్స్ విలువలో ఎక్కువ మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ విషయాన్ని గ్రహించిన జెన్ స్ట్రీట్ పలు వ్యూహాలతో భారత మార్కెట్లో ట్రేడింగ్ చేసింది. మోసపూరిత ట్రేడింగ్‌ల కోసం భారత్‌లో జెన్ స్ట్రీట్ ఆసియా ట్రేడింగ్ లిమిటెడ్, జెన్ స్ట్రీట్ ఇండియా ట్రేడింగ్ ప్రయివేటు లిమిటెడ్, జెన్ స్ట్రీట్ ఆసియా ఎల్ఎల్‌సి అనే సంస్థలను రిజిస్టర్ చేసింది. ఒక కంపెనీ షేర్లను పెంచడం, తగ్గించడం చేసి, దాని ఆధారంగా ఆప్షన్స్ సూచీల్లో ట్రేడింగ్ చేసి భారీగా కొల్లగొట్టింది. ఈ విధంగా 2023 జనవరి నుంచి 2025 మార్చి 31 వరకు రూ.43,289 కోట్ల లాభాలను సంపాదించింది. కేవలం 21 రోజుల్లో రూ.4,843 కోట్ల ఆదాయాలను సంపాదించిందని సెబీ ప్రాథమికంగా గుర్తించింది. 2024 జనవరి 17వ తేదీ సహా మరో 14 బ్యాంక్ నిఫ్టీ ఎక్స్‌పైరీ డేట్లలో జెన్ స్ట్రీట్ అనుసరించిన విధానాలను సెబీ విశ్లేషించి.. ఈ మోసాన్ని గుర్తించింది. ఒక సంస్థ క్యాష్, ఫ్యూచర్ మార్కెట్లలో ఆర్డర్లు పెట్టడం, లావాదేవీలు చేయడం చేస్తుంటే.. అదే సమయంలో మరో సంస్థ ఆప్షన్స్ మార్కెట్లో దానికి అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించేదని సెబీ విశ్లేషించింది.

ఆగస్టుకు కొత్త పాస్ పుస్తకాలు

- వారసత్వ భూములకు సక్సెషన్ సర్టిఫికెట్
- రెవెన్యూశాఖపై సిఎం సమీక్ష



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని భూ యజమానులకు ఆగస్టు నాటికి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని సిఎం చంద్రబాబునాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ శాఖపై రెవెన్యూశాఖ మంత్రి అనగానితో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆధార్‌తో సమగ్ర భూ వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓలు, పాలసీలను అనుసరించి కొత్త రెవెన్యూ మాన్యువల్ ఆగస్టుకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రైవేట్ టీమ్‌తో ఆడిటింగ్ చేసినప్పుడే ఒక అంచనా వస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజలు అనధికారికంగా ఉంటున్న అభ్యంతరం లేని ప్రాంతాల్లో రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అక్టోబరు నాటికి రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ శాశ్వత కులధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. ఈ ఏడాదిలో 43.89 లక్షల మందికి సర్టిఫికెట్లు అందజేశారని, మిగిలిన వారికి కూడా అందించాలన్నారు. ఒకసారి ధ్రువీకరణ పొందితే వారి కుటుంబసభ్యులకు ఆ డేటా ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రం వచ్చేలా చూడాలన్నారు. ఎస్‌సిలకు స్మశాన వాటికల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 363 హేబిటేషన్స్‌కు శ్మశాన వాటికలకు స్థలాలు ఇవ్వాలని, ఇందుకు రూ.137కోట్లతో భూ సేకరణ చేయాలని అన్నారు.

రూ.100 చెల్లిస్తే సక్సెషన్ సర్టిఫికెట్

వారసత్వంగా వచ్చే భూములను పంచుకునే విషయంలో రూ.100 చెల్లించి సక్సెషన్ (సర్టిఫికెట్) చేసుకోవచ్చుని, ఆ భూమి విలువ రూ.10 లక్షలైతే రూ.వెయ్యి చెల్లించి సక్సెషన్ చేసుకోవచ్చని సిఎం వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అవసరమైన అధికారాలు ఇవ్వాలని ఆయన సూచించారు. అదే విధంగా రీ సర్వే 2.0 కు ఆర్థిక సమస్య రాకుండా చూడాలని, కేంద్రం ఇచ్చే నిధులను రీ సర్వేకే వినియోగించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భూములు రీ సర్వే జరిగే గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు గ్రామ, వార్డు సచివాలయాల గ్రామ సర్వేయర్లను యథావిధిగా కొనసాగించాలని సిఎం పేర్కొన్నారు..

ఇంటి స్థలాల కోసం క్యాబినెట్ సబ్‌కమిటీ

రాష్ట్రంలో ఇల్లు, ఇంటి స్థలం లేని వాళ్లు ఉండకూడదని, రెండేళ్లలో ఇంటి స్థలం, మరో రెండేళ్లలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇళ్ల స్థలాలకు ఈ ఏడాది కాలంలోనే ఇప్పటి వరకు 99,390 మంది దరఖాస్తు చేశారని, వీరి కోసం 2051 ఎకరాల భూమి అవసరమని చెప్పారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు పట్టణాల్లో 2 సెంట్లు, రూరల్‌లో 3 సెంట్ల కోసం భూసేకరణ చేయాలని, పట్టణాల్లో టిడ్కో ఇళ్లు ఇవ్వాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, హౌసింగ్, మున్సిపల్ శాఖ మంత్రులతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం ప్రకటించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం గ్రాంట్స్ కింద ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు.

కేరళలో మళ్లీ నిపా వైరస్ కలకలం

- రెండు కేసులు నమోదు

తిరువనంతపురం : కేరళలో మళ్లీ నిపా వైరస్ వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో తాజాగా రెండు కేసులు నమోదయ్యాయి. కోజికోడ్‌లో అక్యూట్ ఎన్‌సెఫాలిటిస్ సింద్రోమ్ (ఎఇఎస్)తో మరణించిన 18 ఏళ్ల యువతికి, మలప్పురం జిల్లాలో పెరింతల్మన్నలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 33 ఏళ్ల మహిళకు నిపా వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని పుణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవి) శుక్రవారం వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో రెండు నెలల తరువాత మళ్లీ నిపా కేసులు వెలుగుచూసినట్లయింది. చివరిసారిగా మలప్పురం జిల్లాలో వాలంచెరికి చెందిన 42 ఏళ్ల మహిళకు నిపా నిర్ధారయింది. పుణేలోని ఎన్ఐవి కేసులను నిర్ధారణ చేయకముందే రాష్ట్రంలో నిపా ప్రోటోకాల్‌ను అమలు చేయడం ప్రారంభించామని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారు. తాజా కేసుల నేపథ్యంలో రాష్ట్ర వైద్య శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. కోజికోడ్ యువతికి చికిత్స చేసిన వైద్యులను, ఇతర సిబ్బందిని క్వారంటైన్‌లో ఉంచారు. మలప్పురం మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు జిల్లా వైద్య అధికారి ఆర్ రేణుక తెలిపారు.



ప్రజాభిప్రాయ సేకరణ సభలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మా భూములు ఇవ్వంగాక ఇవ్వం

ప్రజాభిప్రాయ సేకరణలో సబ్ కలెక్టర్‌కు తేల్చిచెప్పిన కరేడు రైతులు

మా శవాలపై పరిశ్రమ పెడతారా? అంటూ ఆగ్రహం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

'ఇండో సోల్ ప్రాజెక్టు కోసం మా భూములు ఇవ్వంగాకా ఇవ్వం. ఈ భూమే మాకు ఆధారం. మా తాతలు, ముత్తాతల నుంచి సంక్రమించిన భూమి మా బిడ్డలకు మాత్రమే ఇస్తాం' అంటూ ప్రజాభిప్రాయ సేకరణలో కరేడు రైతులు సబ్ కలెక్టర్‌కు తేల్చి చెప్పారు. పచ్చని పొలాల్లో పరిశ్రమలు పెట్టమని ఏ చట్టం చెప్పింది. మా శవాలపై పరిశ్రమ పెడతారా' అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కందుకూరు సబ్ కలెక్టర్ అధ్యక్షతన కరేడు సచివాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ మిగతా 7లో

ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు

- అమలు కోసం సిపిఎం డిమాండ్
- కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సిపిఎం విజ్ఞాపన' బుక్‌లెట్ ఆవిష్కరణ
- 'ఎంపిక కమిటీ'లో చీఫ్ జస్టిస్ ఉండాలి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎన్నికల సంస్కరణలు జరగాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన 'కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సిపిఎం విజ్ఞాపన' బుక్‌లెట్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ను తొత్తుగా మార్చుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కమిషనర్ ఎంపిక కమిటీలో చీఫ్ జస్టిస్‌ను తొలగించి కేంద్ర క్యాబినెట్ మంత్రిని పెట్టారని, అక్కడ ప్రధాని, ప్రతిపక్ష నేతతోపాటు ఖచ్చితంగా చీఫ్ జస్టిస్ ఉండాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ సంస్కరణల మీద దేశ వ్యాప్తంగా ప్రచారం చేయాలని సిపిఎం నిర్ణయించిందని, మేధావులతో కూడా చర్చిస్తామని చెప్పారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఓటర్ల లిస్టును తాజాపర్చే పేరుతో తీసుకొచ్చిన నిబంధనలు ఓటు హక్కును తిరస్కరించేవిగా ఉన్నాయని అన్నారు. సవాలక్ష నిబంధనలు పెడుతూ బలహీనవర్గాలు, మైనార్టీలు, వలసపోయిన వారికి ఓట్లు నిరాకరించే మిగతా 7లో



కొమురయ్య, అల్లూరి సీతారామరాజు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వి శ్రీనివాసరావు, డి.రమాదేవి, వై వెంకటేశ్వరరావు .. వార్త2లో



ఇఎపిసెట్ నోటిఫికేషన్ విడుదల

- 7 నుంచి రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఇఎపిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. ఉన్నత విద్యామండలి శుక్రవారం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నెల 7 నుంచి 16 వరకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు ఫీజు చెల్లించే అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో గానీ, హెల్ప్ కేంద్రాల వద్ద గానీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 17 వరకు చేసుకోవచ్చు. ఈ నెల 10 నుంచి 18 వరకు అభ్యర్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. వీటిని 19న మార్చుకునేందుకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది. 22 నుంచి సీట్ల కేటాయింపును విడుదల చేస్తుంది. 23 నుంచి 26వ తేదీ వరకు సీట్లు పొందిన అభ్యర్థులు కళాశాలల్లో చేరేందుకు అవకాశం కల్పించింది. ఆగస్టు 4 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలపై

ప్రజాగ్రహం

- ఎపి సిపిడిసిఎల్ ఆఫీస్ వద్ద మహా ధర్నా
- 50 వేల వినతులను తోరణాలుగా కట్టి వినూత్న నిరసన

ప్రజాశక్తి- విజయవాడ సిటీ



స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఎపి సిపిడిసిఎల్ విద్యుత్ కార్యాలయం వద్ద మహా ధర్నా

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలపై ప్రజలు ఆగ్రహించారు. విజయవాడలోని ఎపి సిపిడిసిఎల్ విద్యుత్ కార్యాలయం వద్ద పోరుబాటలో భాగంగా శుక్రవారం మహాధర్నా నిర్వహించారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని నినాదాలు చేశారు. సిపిఎం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ విధానంలో ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన పది రోజులుగా విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం జరిగింది. దీంతో, వినతిపత్రాలతో ప్రజలు రమేష్ హాస్పిటల్ ఎదురుగాగల ఎపి సిపిడిసిఎల్ విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సేకరించిన 50 వేల వినతులను ఈ కార్యాలయ గోడలకు తోరణలుగా ప్రజలు, సిపిఎం నాయకులు అలంకరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. మహాధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ అదాని సంస్థతో చేసుకున్న సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, గత ప్రభుత్వ విద్యుత్ ఒప్పందాలను పున్ణసమీక్షించాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని గత ఎన్నికల ముందు టిడిపి కూటమి నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక టిడిపి కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారం వేయడం అమానుషమని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు మూతబడుతున్నాయన్నారు. వాటిపై ఆధార పడిన వారి ఉపాధి దెబ్బతింటోందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని గతంలో పిలుపునిచ్చిన టిడిపి కూటమి నేతలే నేడు మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వడం గర్హనీయమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన చిన్న పరిశ్రమలకు, మిగతా 7లో

మాట తప్పితే 12 అర్ధరాత్రి నుంచి సమ్మె

జీతాల పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే ఈ నెల 12న అర్ధరాత్రి నుంచి సమ్మెకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సిద్ధమవుతున్నారు. 12లోగా డిమాండ్లను నెరవేర్చకుంటే సమ్మెలోకి వెళ్తామంటూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) తేల్చిచెప్పింది. జిఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని, మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని పేర్కొంది. ఈ మేరకు రోజువారీ నిరసన కార్యక్రమాలు చేపట్టనుంది.

...వార్త 3లో..

కెజిబివిలో ఫుడ్‌పాయిజన్

- 30 మంది విద్యార్థినులకు అస్వస్థత

3

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం వద్ద 15.4 అడుగులు • ధవళేశ్వరం వద్ద 10.70 అడుగులు

ప్రజాశక్తి- యంత్రాంగం



ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి

గోదావరి ఎరుపెక్కింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరద నీరు క్రమంగా వచ్చి చేరుతోంది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు 15.4 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి 98,609 క్యూసెక్కుల వరద కాటన్ బ్యారేజీకి చేరుతోంది. దీంతో 37 గేట్లు, ర్యాలి ఆర్మ్‌లో 20, మద్దూరు ఆర్మ్‌లో 11, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 14 గేట్లను 0.40 మీటర్ల మీర పైకెత్తి 99,689 క్యూసెక్కుల అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.70 అడుగులు నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 1,68,729 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. 902 హిల్ ప్రాంతం నుండి స్పిల్ ఛానల్ మీదుగా దిగువ కాఫర్ డ్యామ్‌కు వేసిన రోడ్డు మార్గం పూర్తిగా నీటమునగడంతో లారీలు స్పిల్‌వే మీదుగా ప్రయాణిస్తున్నాయి.

ప్రాజెక్ట్ దిగువన ఆరు మీటర్ల నీటిమట్టం నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పోలవరం నిర్వాసిత మండలాల్లోని గోదావరి, శబరి నదుల ప్రవాహాలు క్రమేపీ పెరుగుతున్నాయి. వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు అధికారులు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. వరద పెరుగుతుండడంతో కూనవరం, విఆర్.పురం, ఎటపాక, చింతూరు మండలాల వాసుల్లో భయాందోళన నెలకొంది. దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయంలోకి భారీగా వరద నీరు ప్రవేశించడంతో దర్శనాలు నిలిపివేస్తున్నట్లు దేవస్థాన ఇఒ ప్రకటించారు.

ఎంహెచ్ స్మారక జర్నలిస్టు అవార్డు - 2025 ఎంట్రీలకు 10 వరకూ గడువు పెంపు



ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు (ఎంహెచ్) పేరిట ప్రతి ఏటా ఇస్తున్న ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం పాత్రికేయులు తమ ఉత్తమ కథనాలను పంపాల్సిన గడువును ఈనెల 10 వరకూ పొడిగించాం. మహిళలు, పిల్లలు, దళితులు, వికలాంగులు, బడుగు బలహీన వర్గాలు, అల్ప సంఖ్యాక వర్గాల సమస్యలను వెలికి తీసే పరిశోధనాత్మక, ప్రయోజనాత్మక కథనాలను ఈ ఏడాది పరిశీలనకు ఆహ్వానించాం. 2024 జూన్ 1 నుంచి 2025 మే 31 మధ్య తెలుగు పత్రికల్లో ప్రచురితమైన కథనాలను పంపాలి. ఉత్తమ కథనాలను, అవి రాసిన జర్నలిస్టు వివరాలతో ఇతరులు కూడా ప్రతిపాదనలు పంపవచ్చు. ఎంట్రీలు పంపాల్సిన చిరునామా, ఈమెయిల్ ఐడి వివరాలు ప్రజాశక్తి వెబ్ ఎడిషన్లో చూడొచ్చు. నిర్ణాయక కమిటీ ఎంపిక చేసిన జర్నలిస్టుకు ఆగస్టు 1వ తేదీన గుంటూరులో జరిగే 'ప్రజాశక్తి' 44వ వార్షికోత్సవ సభలో పురస్కార ప్రదానం ఉంటుంది.

– కార్యదర్శి,
ప్రజాశక్తి సాహితీ సంస్థ

గాజాలో తీవ్రమైన మానవతా సంక్షోభం

- ఆందోళన వ్యక్తం చేసిన ఐరాస సెక్రటరీ జనరల్ గుట్రేస్
- అంతర్జాతీయ చట్టాలను పాటించని ఇజ్రాయిల్

7

'అల్లూరి' పోరాటం అజరామరం

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు పోరాటం అజరామరంగా నిలిచిపోతుందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఆ మహనీయుని వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. మంగళగిరి డిజిపి కార్యాలయంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి డిజిపి పూలమాల వేసి నివాళు లర్పించారు.

విద్యుత్ పురోగతిపై సిఎస్ ఆధ్వర్యాన స్టీరింగ్ కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


విద్యుత్ పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 57ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం విడుదల చేశారు. నీతి ఆయోగ్‌తో కుదిరిన ఒప్పందం మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసింది. విద్యుత్ పురోగతిపై ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీకి కన్వీనర్ మెంబర్‌గా ఆంధ్రప్రదేశ్ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎపిపిసిసి) కన్వీనర్ మెంబర్ ఉంటారు. సభ్యులుగా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రోడ్లు, భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో సిఎమ్‌డి, మూడు డిస్కంల సిఎమ్‌డిలు, జెన్‌కో ఎమ్‌డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి వ్యవహరిస్తారు. నోడల్ ఆఫీసర్‌గా ఎపిపిసిసి కన్వీనర్ మెంబర్ ఉంటారు.

అల్లూరి ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయం

- జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-యంత్రాగం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో అల్లూరి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ అల్లూరి ఉద్యమ స్ఫూర్తి ఆదర్శమని అన్నారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో జరిగిన వేడుకల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, అనకాపల్లి, విజయనగరం ఎంపిలు సిఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. అల్లూరి, గంటం దొర సమాధుల వద్ద పూలమాలలు ఉంచి నివాళ్లర్పించారు. అల్లూరి స్మారక పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. రెండు వేల మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అల్లూరిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, థింసా నృత్యాలు ఆకట్టుకున్నాయి. అల్లూరి జన్మస్థలమైన విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగిలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అల్లూరి జిల్లాలోని అరకులోయలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ అల్లూరిని యువత ఆదర్శంగా తీసుకొని గిరిజన హక్కులు, చట్టాల రక్షణ కోసం పోరాడాలని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ పి.ప్రశాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, విజయనగరం, నెల్లూరు జిల్లాల్లో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి పాల్గొని అల్లూరి స్ఫూర్తిని కొనియాడారు. పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి సభ జరిగింది. డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పి.రాజశేఖర్ అధ్యక్షతలో జరిగిన సభలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రామస్వామి పాల్గొని మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అల్లూరి చిత్ర పటానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షులు కంకణాల ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆంజనేయులు మాట్లాడుతూ.. అల్లూరి స్ఫూర్తితో విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేటలో అల్లూరి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు, ఎంపీలు

అల్లూరి, కొమురయ్య జాతీయ విప్లవ వీరులు

- నివాళి కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మన్యం విప్లవీరులు అల్లూరి సీతారామరాజు, తెలంగాణా సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య భరతమాత ముద్దుబిడ్డలు, జాతీయ విప్లవ వీరులని, వారు ప్రజలందరి సొత్తని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విజయవాడ బాలోత్సవ భవన్లో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి, దొడ్డి కొమురయ్య 79వ వర్థంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన నాయకులను దురదృష్టవశాత్తూ కొంతమంది కులనాయకులుగా మార్చేస్తున్నారని అన్నారు. దీని ద్వారా వారి ఉద్యమ, స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని తెలిపారు. యువతరానికి వారిని కుల నాయకులుగానో, మత నాయకులుగానో చూపిస్తే దేశ అనైక్యతకు, విచ్ఛిన్నానికి కారణమవుతుందని అన్నారు. బిజెపి వచ్చిన తరువాత ఇటువంటి కుల, మత ప్రభావాలతో చరిత్రను వక్రీకరిస్తోందని తెలిపారు. కొత్త తరానికి జాతీయ ఉద్యమ స్ఫూర్తిని రగిలించేందుకు వారి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ప్రచురించాల్సి ఉందని అన్నారు. దీనిద్వారా సమైక్యత, జాతీయ స్ఫూర్తి ప్రజల్లో కలుతుందని తెలిపారు.

అమరావతికి గ్రాంటు?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాజధాని నగరం అమరావతి నిర్మాణం కోసం 15 వేల కోట్ల రూపాయలకు కేంద్రం నుండి గ్రాంటుగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రయత్నాలకు కేంద్రం నుండి సానుకూల స్పందన కూడా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అయితే, దీనికి సంబంధించి లిఖిత పూర్వకంగా ఎటువంటి సమాచారమూ రాష్ట్ర ప్రభుత్వానికి రాలేదు. దీంతో ఈ విషయం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్రం కొన్ని షరతులతో గ్రాంటు ఇచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎటువంటి షరతులు ఉండే అవకాశం ఉందన్న అంశంపై అధికారుల్లో ఆసక్తి కరమైన చర్చ సాగుతోంది. కొన్నేళ్లుగా నిలిచిపోయిన అమరావతి పనులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే మళ్లీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనికోసం ప్రపంచబ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల నుంచి 15వేల కోట్లను రుణంగా కూడా తీసుకుంది. తాజాగా ఈ నిధులను కేంద్రమే భరించేందుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే వార్షిక రుణంలో వివిధ పథకాలకు తీసుకునే రుణాలను కూడా కలిపి చూపిస్తారు. అయితే ఈ ఏడాది రుణ విభాగంలో ప్రపంచబ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల ద్వారా రాజధానికి తీసుకున్న 15 వేల కోట్ల రుణాలను కలిపి చూపించలేదని ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. అందుకే ఈ మొత్తం గ్రాంటుగా మార్చుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఇదే సమయంలో రాజధాని కోసం హడ్కో నుంచి తీసుకున్న 11 వేల కోట్లు, కెఎఫ్‌సి బ్యాంకు నుంచి తీసుకున్న ఐదు వేల కోట్ల రుణంపై కూడా అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ రుణాలపై కేంద్రం వద్దకు మాఫీ డిమాండ్‌ను తీసుకువెళ్లే ఆలోచన కూడా ఆర్థిక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు చేస్తున్నట్లు సమాచారం.



అల్లూరి స్మారక మందిరంలో ఎమ్మెల్యే తనయుడు భరత్, ఇతర నేతలు అధికారులు

గోదావరి జలాలపై కేంద్రం బాధ్యతారాహిత్యం

- అంతర్రాష్ట్ర వివాదాల్లోకి నెట్టే కుట్ర
- బనకచర్ల ప్రజలకు భారం
- విలేకరుల సమావేశంలో వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరి నీటి పంపకం విషయంలో కేంద్రం అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఆంధ్రా, తెలంగాణా మధ్య జుట్లు ముడేసి 'తన్నుకు చావండి తమాషా చూస్తా' అనే వైఖరి ని కేంద్రం తీసుకుందన్నారు. అంతర్రాష్ట్ర వివాదాల్లోకి నెట్టే కుట్రను కేంద్రం చేస్తోందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతి కూడా ఉపయోగపడుతోందని చెప్పారు. పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు చేస్తే, సిడబ్ల్యుసి అనుమతి తీసుకోవాలని సూచించడంతోపాటు వారికి సంబంధం లేని నీటి గ్యారంటీ గురించి ప్రశ్నించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. నీటిలభ్యత అంశాన్ని అడ్డుపెట్టుకుని పర్యావరణశాఖ ద్వారా కేంద్రం వివాదాన్ని లేవనెత్తిందని, నీటిలభ్యత లేదని అనుమతి ఇవ్వలేము అంటే లేని వివాదాన్ని సృష్టించడమే అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కిమ్మనడం లేదన్నారు. ఎపి, తెలంగాణా మధ్య జలాల పంపకం విషయంలో కేంద్రం శ్రద్ధ తీసుకోలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రాష్ట్రం అనుమతి తెలిపిందని, తెలంగాణా మాత్రం బనకచర్లకు అభ్యంతరం పెడుతోందని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం, సరైన పద్ధతులు పాటించకపోవడంతో ఈ సమస్య వచ్చిందని తెలిపారు. బనకచర్ల అంశాన్ని గోదావరి మేనేజ్‌మెంట్ బోర్డులోనూ, అపెక్స్ కౌన్సిల్లోనూ పెట్టొచ్చని అలా చేయకుండా నేరుగా పర్యావరణ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుల్లో ముఖ్యంగా వెలిగొండ పూర్తికి 18 కిలోమీటర్ల టన్నెల్ తవ్వడానికి 16 సంవత్సరాలు పట్టిందని, బనకచర్లకు 26 కిలోమీటర్ల టన్నెల్ తవ్వడానికి మూడేళ్ళలో ఎలా చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. పోలవరం కుడి కాలవ సామర్థ్యాన్ని 38 వేల క్యూసెక్కులు పెంచాలని నిర్ణయించారని, అంత సామర్థ్యాన్ని ప్రస్తుత కాలువ తట్టుకోలేదని అన్నారు. 200 టిఎంసిలు కృష్ణాకు తరలించి అక్కడ నుండి బొల్లాపల్లికి అక్కడ నుండి బనకచర్లకు తరలిస్తామంటున్నారని 100 టిఎంసిలు కృష్ణాడెల్టాకు సరిపోతే బొల్లాపల్లికి వెళ్లేది 100 టిఎంసిలేనని తెలిపారు. దీనికోసం రూ.80 వేల కోట్లు ఖర్చు పెడతారా అని ప్రశ్నించారు. రాయలసీమలో హంద్రీ నీవా కాలువకు నీరిస్తే రైతుకు మేలు జరుగుతుందని, వెలిగొండ ద్వారా కడప, ప్రకాశం జిల్లా, వరికిపూడిశెల ద్వారా పల్నాడు, జంఝావతి ద్వారా విజయనగరం శ్రీకాకుళం, వంశధార, సుజల స్రవంతి ఉత్తరాంధ్ర ద్వారా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే వీటిని వదిలేసి ఎవరిని ఉద్ధరించడానికి బనకచర్ల చేపట్టారని ప్రశ్నించారు. బనకచర్ల పేరుతో నీటిని ప్రైవేటుపరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

సెల్ఫ్ ఫైనాన్స్, గేమ్ ఛేంజర్ అనడం ద్వారా నీటిని కార్పొరేట్ పరం చేస్తారని, నీరు ఖరీదైన వస్తువుగా మారుతుందని అన్నారు. భవిష్యత్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, బొట్టు బొట్టుకు డబ్బు చెల్లించాల్సి రావడం ద్వారా ప్రజలు భరించలేని పరిస్థితి వస్తుందని అన్నారు. భవిష్యత్‌లో నీరు కూడా కరెంటులాగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివెనుక ఉన్న రహస్య ఏజెండాను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఈ చర్య నీటిని ప్రైవేటీకరించేందుకు, మేఘాలాంటి కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడుతుందని, ఇప్పటికే బనకచర్ల ప్లాను కూడా వారే తయారు చేశారని చెబుతున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టుపై సమగ్ర చర్చ జరగాలని అన్నారు. గోదావరిలో నీటిని తరలించడానికి, వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వడానికి అభ్యంతరం లేదని, ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులతో ఆ పనిచేయొచ్చని సూచించారు. విడివిడి ప్రాజెక్టులన్నీ పూర్తయితే వాటిని కలపడం సులభమన్నారు.

ధాన్యం బకాయిల చెల్లింపు కోసం
మరో రూ.వెయ్యి కోట్ల రుణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రబీలో (2024-25)లో ధాన్యం సేకరణకు మార్క్‌ఫెడ్ ఎన్‌సిడిసి (నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఇప్పటికే తీసుకున్న రూ.6,700 కోట్లకు అదనంగా తాజాగా ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లు రుణం తీసుకుంది. ఈ మేరకు జిఓ ఎంఎస్ నెంబరు 25ను శుక్రవారం విడుదల చేసింది. ఈ నిధులను ఎపి సివిల్ సప్లై కార్పొరేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు జిఓలో పేర్కొంది. ఈ రుణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది.

జడ్జిపై ట్రోల్‌ను ఖండించిన హైకోర్టు బార్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి

ఒక కేసులో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేయడాన్ని హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జగన్ పర్యటన సందర్భంగా కారు కింద ఒక వ్యక్తి పడి మరణించిన కేసు విచారణపై తదుపరి చర్యలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వుల జారీ తర్వాత జడ్జిని లక్ష్యంగా చేసుకొని సామజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరిగిందని అసోసియేషన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

హైస్కూల్ ప్లస్‌లో అధ్యాపకుల నియామకం

- పండగ వాతావరణంలో మెగా పిటిఎం నిర్వహణ
- సమీక్షలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అధ్యాపకుల నియామకంపై చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉన్నత, పాఠశాల విద్యాశాఖలపై ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిఎస్‌సిలో ఎంపికైన టీచర్లకు ఆగస్టు నాటికి నియామక ఉత్తర్వులిచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డిఎస్‌సిని అడ్డుకునేందుకు వైసిపికి చెందిన వారు 32 కేసులు వేసినప్పటికీ అధిగమించి విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు పాఠశాలలకు చేరుకునే క్రమంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధ్యయనం చేసి అవసరమైనచోట నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఈ ప్రాంతాల్లో మారుమూల పాఠశాలలకు మొబైల్ నెట్‌వర్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డిగ్రీ విద్యార్థులకు భారం తగ్గించాలి

డిగ్రీ విద్యార్థులకు భారం తగ్గేలా యుజిసి నిబంధనలకు అనుగుణంగా సబ్జెక్టుల ఎంపిక విధానం ఉండాలని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. డిగ్రీ అడ్మిషన్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో విద్యార్థులకు, కళాశాలలకు అవకాశం కల్పించాలని తెలిపారు. కళాశాలలు భర్తీచేసే సందర్భంలో విద్యార్థుల అంగీకారాన్ని ఆధార్‌తో అనుసంధానించాలని సూచించారు. గత విద్యాసంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. నిర్ణీత కేలండర్ ప్రకారం అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షలను పూర్తిచేసి సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేయాలని తెలిపారు. ఆర్‌జెయుకెటిల్లో అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ముందుకొచ్చిన యాజమాన్యాలతో మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమర్థవంతంగా యుడైస్ ఎన్‌రోల్‌మెంట్

ఇంటర్ విద్యలో యుడైస్ ఎన్‌రోల్‌మెంట్‌ను సమర్థవంతంగా చేపట్టాలని ఇంటర్మీడియట్ విద్య సమీక్షలో మంత్రి ఆదేశించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్‌లో గానీ, వృత్తి విద్యా కోర్సుల్లో గానీ తప్పనిసరిగా ప్రవేశం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ విద్యార్థి ఇంట్లో ఉండటానికి వీల్లేదన్నారు. ప్రవేశం ఎక్కడ తీసుకున్నారో పాఠశాల విద్యతో సమన్వయం చేసుకొని ట్రాక్ చేయాలని చెప్పారు. రాష్ట్రంలో నిరక్షరాస్యులకు అక్షర ఆంధ్ర (ప్రాజెక్టు అఆ) కార్యక్రమాన్ని ఆగస్టు 7 నుంచి ప్రారంభించనున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు.



3 నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు

ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని నైపుణ్యాభివృద్ధిశాఖ సమీక్షలో అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా యువత, పరిశ్రమలను అనుసంధానించేలా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న సింగిల్ ప్లాట్‌ఫామ్ నైపుణ్యం పోర్టల్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత ఆటోమెటిక్‌గా రెజ్యూమ్ సిద్ధమయ్యేలా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ సమీక్షలో ఉన్నత, పాఠశాల విద్య, నైపుణాభివృద్ధి శాఖల కార్యదర్శి కోన శశిధర్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి, సాంకేతిక విద్య డైరెక్టర్ జి గణేష్‌కుమార్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కార్యదర్శి కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

మోగల్లులో అల్లూరి స్మారక మందిరం

- హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ప్రజాశక్తి - పాలకోడేరు (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో నిర్మించిన అల్లూరి స్మారక మందిరాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం కోసం అల్లూరి వంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చిందన్నారు. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి అని కొనియాడారు. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాల నేది అల్లూరి ఆశయమన్నారు. అనంతరం స్మారక మందిరంలోని అల్లూరి విగ్రహానికి డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు తనయుడు కనుమూరు భరత్, డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కునాధరాజు మురళీకృష్ణరాజు, గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షులు మోగల్లు బాబు, కలిదిండి సందీప్ వర్మ నివాళులర్పించారు.స్మారక మందిరాన్ని గజల్ శ్రీనివాస్ సందర్శించారు. పాఠశాల విద్యార్థులు ర్యాలీ, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

కౌన్సెలింగ్ లేకుండా చేసిన బదిలీలు నిలుపుదల చేయాలి

- గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల సందర్భంగా కొన్ని జిల్లాల్లో కౌన్సెలింగ్ నిర్వహించలేదని, మరికొన్ని జిల్లాల్లో ఐదేళ్ల సర్వీస్ దాటకపోయినా బదిలీలు నిర్వహించారని, అటువంటి బదిలీలను నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్‌డి జానీపాషా, బత్తుల అంకమ్మరావు.. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్, సచివాలయశాఖ మంత్రి పేషీలో వినతిపత్రం అందజేశారు. బదిలీల్లో కనీసం ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు, వికలాంగులను కూడా పట్టించుకోకుండా సీనియార్టీ లేని వారికి, నిబంధనలకు విరుద్ధంగా సిఫార్సు లేఖల ఆధారంగా పోస్టింగులు ఇవ్వడం అన్యాయమైన చర్య అని పేర్కొన్నారు.

శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీయలేదు

- 'రాయుడు గారి మిలటరీ హోటల్' యజమాని

ప్రజాశక్తి - గండేపల్లి(కాకినాడ జిల్లా)

తమ హోటల్‌లో ఉన్నది వెంకటేశ్వరస్వామి గుడాయి ఆర్ట్ వర్క్ మాత్రమేనని, ఎలాంటి గుమ్మాలు పెట్టలేదని, కేవలం రెండు అడుగులు మాత్రమే ఉండే ఈ ఆర్ట్ వర్క్ వీడియోలు, ఫొటోల్లో దూరంగా ఉన్నట్లు కనిపిస్తుందని 'రాయుడి గారి మిలటరీ హోటల్' యజమాని ఏరుకొండ రఘురాం తెలిపారు. గండేపల్లి మండలం మల్లేపల్లిలో 214వ నెంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఆరు నెలల క్రితం ప్రారంభించిన 'రాయుడి గారి మిలటరీ హోటల్‌'లో తిరుపతి వెంకటేశ్వరస్వామి సెట్ వేశారని ఆరోపిస్తూ బిజెపికి చెందిన సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వీడియో ఆధారంగా తిరుపతికి చెందిన జనసేన నేత కిరణ్‌రాయల్ టిటిడికి ఫిర్యాదు చేశారు. క్షమాపణలు చెప్పి 24 గంటల్లో సెట్టింగ్ తొలగించకపోతే దాడి చేస్తామని హెచ్చరించారు. హోటల్ యజమాని వివరణ ఇచ్చారు. తిరుపతి వెంకటేశ్వరస్వామి తమ ఆరాధ్యదైవమని, వెంకటేశ్వరస్వామిని వాడుకుని వ్యాపారం చేస్తున్నామని ప్రచారం చేయడం తగదన్నారు. వ్యాపార సంస్థల్లో కుల దైవాన్ని పెట్టుకోవడం తప్పని అనుకోవడం లేదని పేర్కొన్నారు. ఏ వ్యాపార సంస్థలోనైనా వెంకటేశ్వరస్వామిని పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆ ఉద్దేశంతో తాము పెట్టుకున్నామని, అంతే తప్ప ఎవరి మనోభావాలనూ కించపరిచే ఉద్దేశం లేదన్నారు. కావాలనే కొంత మంది ఈ విషయాన్ని రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు.

'ఆది కర్మయోగి'తో సిబ్బంది సామర్థ్యం పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'ఆది కర్మయోగి' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి క్షేత్రస్థాయి సిబ్బంది సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్ తెలిపారు. విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేస్తూ పార్లమెంటులో తీర్మానం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్
- 'ఉక్కు' పరిరక్షణ ఉద్యమ కార్యాచరణ ప్రకటన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేస్తూ రాబోవు పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం తీర్మానం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'విశాఖ ఉక్కు ప్రస్తుత పరిస్థితి' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్ మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు కార్మికులపై, ఉద్యమంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వ పోలీసు నిర్బంధాన్ని నిలిపివేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిరాహార దీక్షా శిబిరం ఏర్పాటుకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. ఆపరేషన్, మెయింటినెన్స్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌లోని డిపార్టుమెంట్ల ప్రైవేటీకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న పోరాటానికి ప్రజలు మద్దతునివ్వాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డితో సహా అన్ని పార్టీలూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆంధ్ర ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. అనంతరం ఉక్కు పరిరక్షణ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపిల సహకారం కోరి కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో బస్సుయాత్ర చేపట్టాలని, అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో - కన్వీనర్ జె.అయోధ్యరాం, విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ ఎం.మన్మధరావు, సిఎస్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఎఐటియుసి నాయకులు కె.సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, ఐఎన్‌టియుసి అధ్యక్షులు రమణమూర్తి, పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డేవిడ్, టివికె.రాజు, కె.అవతారం, టిఎస్ఎం.రావు, కారు రమణ, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ పాల్గొన్నారు. తొలుత అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్, చిత్రంలో సిహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, ఎం. రాజశేఖర్, జగ్గునాయుడు తదితరులు

పంటల సరళి ఆధారంగా ఎరువుల సరఫరా

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంటల సరళి ఆధారంగా ఎరువుల సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, యూరియా దొరకదనే దుష్ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు కోరారు. అవసరం మేరకు సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు షాపుల నుంచి యూరియా సరఫరాకు సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని చెప్పారు. తాడేపల్లిలోని డైరెక్టర్ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ.. డీలర్లు నిబంధనలను ఉల్లంఘించి కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లించినా, అధిక ధరలు వసూలు చేసినా లైసెన్స్ రద్దు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెరిగినందున మరో పదిరోజుల్లో వరి నాట్లు ఊపందుకునే అవకాశం ఉందని, ఎరువుల తయారీదారులు సరఫరా, పంపిణీపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8.73 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండగా, వీటిలో యూరియా 3.12 లక్షల మెట్రిక్ టన్నులు, డిఎపి 0.85 లక్షల మెట్రిక్ టన్నులు, ఎంఒపి 0.58 లక్షల మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 0.57 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3.60 లక్షల మెట్రిక్ టన్నులు సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేసినట్లు చెప్పారు. జులై మాసానికి సంబంధించి మొత్తం 3.84 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా 6.22 లక్షల మెట్రిక్ టన్నుల వినియోగం ఉండగా, ఇప్పటి వరకూ 1.95 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి రాగా, ప్రారంభ నిల్వతో కలిపి 4.93 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల గతేడాది కంటే 30 శాతం అధికంగా రానున్న అవసరాల కోసం నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి, సంయుక్త సంచాలకులు కృపాదాస్, ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట తప్పితే 12న అర్ధరాత్రి నుంచి సమ్మె

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే ఈ నెల 12న అర్ధరాత్రి నుంచి సమ్మెకు సిద్ధమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) వెల్లడించింది. సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలంటూ విజయవాడ ధర్నాచౌక్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం చేపట్టిన మహాధర్నా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణ అధ్యక్షతన జరిగింది. మహాధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. 12లోగా హామీలను నెరవేర్చకుంటే నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోడీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరగనున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తు కార్యాచరణపై మహాధర్నాలో తీసుకున్న నిర్ణయాలను ఆయన ప్రకటించారు. ఈ నెల 5 నుంచి అన్ని మున్సిపల్ పట్టణాల్లో టెంట్లు వేసి నిరసన కార్యక్రమాలు, 7న మానవహారాలు, 8న అర్ధనగ్న ప్రదర్శనలు, 9న ఒకరోజు సమ్మె, 10న రౌండ్‌టేబుల్ సమావేశాలు, 11న బైక్ ర్యాలీలు, 12న ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి జిఓలు రాకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం జీతాలు పెంచాలని, మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సమ్మెకాలపు ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణ మాట్లాడుతూ.. గత ఏడేళ్లుగా ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో అవస్థలు పడుతున్నారన్నారు. కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్ల వల్ల 2022 నుంచి ఒక్కో కార్మికుడు రూ.లక్షల్లో జీతం నష్టపోయారన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి నూకరాజు, ఉరుకూటి రాజు మాట్లాడుతూ.. ప్రమాదకరమైన విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, టిఎ, డిఎలు చెల్లించకుండా ఇంజినీరింగ్ కార్మికులకు పాలకులు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర కన్వీనరు బి ముత్యాలరావు, కో-కన్వీనరు ఎస్ జ్యోతిబసు మాట్లాడుతూ.. పార్కుల్లో పనిచేసే కార్మికులు, లీకు వర్కర్లు, మెకానిక్‌లు, టౌన్‌ప్లానింగ్ దళం కార్మికులు నిరంతరం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నా కనీసం వారికి రక్షణ పరికరాలు, భద్రతా సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. మహాధర్నాలో సిఐటియు విజయవాడ నగర సీనియర్ నాయకులు దోనేపూడి కాశీనాథ్, వివిధ జిల్లాలకు చెందిన నాయకులు కె శ్రీనివాసరావు, ఎ జాన్‌బాబు, చంద్రకళ, గోపి, గంగాధర్‌రెడ్డి, ఓబుళపతి, దుర్గ, రామకృష్ణ, నాగరాజు, చెంగయ్య, మీసాల శ్రీను, విజయలక్ష్మి పాల్గొన్నారు.



విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కె ఉమామహేశ్వరరావు

నల్లాని రాజేశ్వరికి "దక్షిణ భారత మహిళా విజేత" అవార్డు

- 6న చెన్నైలో ప్రదానోత్సవం



ప్రజాశక్తి -అనంతపురం: అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త, రచయిత్రి నల్లాని రాజేశ్వరికి అరుదైన గౌరవం దక్కింది. మూడు దశాబ్దాలకుపైగా బహుముఖ సేవలందిస్తున్న ఆమె.. దక్షిణ భారత మహిళా విజేత - 2025 పురస్కారానికి ఎంపికయ్యారు. విద్య, సాహిత్యం, సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో రాజేశ్వరి అందిస్తున్న బహుముఖ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ తమిళనాడు రాష్ట్ర శాఖ, ట్వల్ మేగజైన్, గ్లోబల్ పింక్ ఆర్మీ సంయుక్త ఆధ్వర్యంలో అవార్డును ఈ నెల 6న తేదీ చెన్నైలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా రాజేశ్వరికి నిర్వాహకులు అందజేయనున్నారు. గతంలో రాజేశ్వరి "రాజ్యమహిళా సమ్మాన్" అవార్డు - 2014, విశిష్ట మహిళా అవార్డు - 2018, ఉగాది పురస్కారం - 2017 అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా బాలల సంక్షేమ సమితి (సి.డబ్ల్యు.సి) చైర్‌పర్సన్‌గా 2018-21 కాలంలో నల్లాని విశేష సేవలందించారు.

బలవంతంగా బడుల విలీనం వద్దు

- ఆందోళన ఉన్నచోట కొనసాగిస్తామని కలెక్టర్ హామీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బలవంతంగా బడుల విలీనం చేయవద్దని, సమస్యాత్మక పాఠశాలలను కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా తడ, కెవిబి పురం, రామచంద్రాపురం, పుత్తూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట మండలాల్లో పాఠశాలల విలీన ప్రక్రియను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యా కమిటీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, రవి, సిఐటియు నాయకులు జయచంద్రతో కలిసి ఆయన పాఠశాలల విలీన సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి చర్చించారు. ఆయా మండలాల్లో గత నాలుగు నెలలుగా 'మా ఊరి బడి మాకే కావాలి' అని పోరాడుతున్నా మండల విద్యాశాఖ అధికారులు తీవ్రతను రిపోర్టు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. విలీన ప్రక్రియ వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితి ఉందన్నారు. కలెక్టర్ స్పందిస్తూ పాఠశాలల విలీనం ఆందోళనలు తీవ్రంగా ఉన్న చోట మినహాయిస్తామని చెప్పారు. హైవే, వాగులు, వంకలు, చిన్నారులకు ఇబ్బంది కలిగించేలా ఉంటే అటువంటి పాఠశాలలను కొనసాగించేలా చేస్తామని హామీ ఇచ్చారు.

డానిష్ ఫైబర్ టెక్నాలజీతో రోడ్లు

- రాష్ట్రంలో తొలిసారిగా మంత్రి జనార్ధనరెడ్డి నియోజకవర్గంలో శ్రీకారం

ప్రజాశక్తి - సంజామల (నంద్యాల): రాష్ట్రంలోని తొలిసారిగా నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం సంజామ మండలంలో డానిష్ ఫైబర్ టెక్నాలజీతో ఆర్ అండ్‌బి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా మండల కేంద్రంలో ముదిగేడు-సంజామల మధ్య జరుగుతున్న రెండు వరుసల రహదారి నిర్మాణ పనులలో చేపట్టిన డానిష్ ఫైబర్ టెక్నాలజీ విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో ప్రయోగాత్మకంగా డానిష్ ఆస్ఫాల్ట్ రీ-ఇన్ఫోర్సింగ్ టెక్నాలజీ వినియోగిస్తున్న క్రమంలో డెన్మార్క్ ప్రతినిధులు, ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులతో కలిసి తారు, అరమిడ్, పాలియోలెఫిన్ అనే ఫైబర్లు కలిపి బిటామిన్ తయారు చేసే మిక్సింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. డానిష్ ఫైబర్ టెక్నాలజీతో నిర్మించిన రోడ్లు గుంతలు పడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు కూడా ఈ రోడ్లు తట్టుకోగలవని వివరించారు. రహదారుల మన్నిక కూడా 50 శాతం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణంలో డానిష్ ఫైబర్ టెక్నాలజీని వినియోగంపై టిడిపి కూటమి ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్ కుమార్, ఆర్‌అండ్‌బి డిఇ రామకృష్ణారెడ్డి, ఎఇ సెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



సంజామలలో డానిష్ ఫైబర్ టెక్నాలజీతో వేస్తున్న రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

విజయవాడ వెస్ట్ బైపాస్‌కు రంగా పేరు : కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: విజయవాడ పశ్చిమ బైపాస్‌కు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. రంగా 78వ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. పేదల పక్షపాతి, వారి అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన నాయకులు రంగా అని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజ టోల్ గేట్ నుంచి చిన అవుటుపల్లి వరకూ 47.8 కిలీమీటర్లు నిడివి ఉన్న రహదారికి మోహనరంగా పేరు పెట్టాలని గతంలో కూడా కూటమి ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

కో-ఆర్డినేటర్ల నియామకం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా అన్ని నియోజకవర్గాలకు కో-ఆర్డినేటర్లను నియమిస్తున్నట్లు ఆ పార్టీ వెల్లడించింది. తాజాగా పది నియోజకవర్గాలకు కో-ఆర్డినేటర్లను నియమిస్తూ పిసిసి అధ్యక్షులు షర్మిల ఆదేశాలిచ్చారు. సింగనమలకు సాకె శంకర్, రాయదుర్గానికి జి ప్రతాప్ రెడ్డి, నగరికి సికె కార్తికేయన్, విజయనగరానికి ఎస్ శ్రీనివాసరావు, విశాఖపట్నం సౌత్‌కు కె వెంకట సత్యనారాయణ, నిడదవోలుకు ఎం భద్రారావు, గుడివాడకు ఎం రాజశేఖర్, యర్రగొండపాలెంకు పాలపర్తి విజేష్ రాజ్, పూతలపట్టుకు పి ప్రభాకర్, సంతనూతలపా డుకు పసుమర్తి సుధాకర్‌ను నియమించారు.

టెన్త్ సప్లిమెంటరీ రీ వెరిఫికేషన్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫలితాలు విడుదలయ్యాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అన్ని సమాధాన పత్రాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసి అందించాలని ఆదేశించారు.

పోలీసుల షరతులకు లోబడి ఇస్కాన్ రథయాత్ర

ప్రజాశక్తి-అమరావతి

పోలీసులు విధించే షరతులకు లోబడి ఈ నెల 5న అనంతపురంలో ఇస్కాన్ సంస్థ రథయాత్ర నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అదేరోజు మొహరం పండగ కూడా ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలకుండా పోలీసులు విధించే షరతులకు కట్టుబడి నిర్వహించాలని ఇస్కాన్ ప్రతినిధులను ఆదేశించింది. శాంతిభద్రతలకు సంబంధించిన సున్నిత అంశమని గుర్తుంచుకోవాలని పేర్కొంటూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



పతకాలు సాధించిన సెక్యూరిటీ, విజిలెన్స్ అధికారులు ఎ.సురేంద్ర, ఎన్టీవీ రామ్‌కుమార్

ప్రపంచ పోలీస్ క్రీడల్లో టిటిడి విజిలెన్స్ అద్భుత విజయం

- విజేతలను అభినందించిన టిటిడి చైర్మన్, ఇఒ

ప్రజాశక్తి -తిరుమల

అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో జరిగిన ప్రపంచ పోలీస్, ఫైర్ గేమ్స్ - 2025 పోటీల్లో టిటిడి సెక్యూరిటీ విజిలెన్స్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు అద్భుత విజయాలు సాధించి జాతీయ మువ్వెన్నల పతాకాన్ని రెపరెపలాడించారు. 45 సంవత్సరాలు పైబడిన విభాగం సింగిల్స్ టెన్నిస్ పోటీలో టిటిడి విజిఒ ఎ సురేంద్ర స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, 55 సంవత్సరాల పైబడిన విభాగం సింగిల్స్ టెన్నిస్ పోటీలో విజిఒ ఎన్‌టివి రామ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ జె శ్యామలరావు విజేతలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల పోలీస్, ఫైర్ విభాగాల నుంచి తొమ్మిది వేల మంది అథ్లెట్లు పాల్గొన్న ఈ ద్వైవార్షిక పోటీల్లో టిటిడి అధికారుల విజయాలు దేశానికే గర్వకారణమని, టిటిడికి ఇది ఒక గొప్ప గౌరవంగా నిలిచిందని కొనియాడారు. విజేతలకు అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒ వి వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ మురళీకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ జాతీయ స్థాయి విజయం టిటిడి సెక్యూరిటీ, విజిలెన్స్ విభాగంలోని అధికారుల నైపుణ్యాన్ని, నిబద్ధతను చాటిందని, ప్రపంచవ్యాప్తంగా టిటిడి ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం తోడ్పడిందని పేర్కొన్నారు.

జల్‌జీవన్‌మిషన్‌తో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

- డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్
- రూ. 1290 కోట్లతో నరసింహాపురంలో తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కరువు తీవ్రంగా ఉందని, అక్కడి ప్రజలు దాహం తీర్చుకునేందుకు రక్షిత నీరు కూడా అందుబాటులో లేదని, రెండు దశాబ్దాలుగా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోందని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంత ప్రజల దాహార్తిని రక్షిత నీటితో తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.1.290 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మార్కాపురం పట్టణ శివారులోని నరసింహాపురంలో తాగునీటి పథకానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ...తాగునీరు, సాగునీరు లేక పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. ఇక్కడి పరిస్థితులపై యువతలోనూ ఆందోళన నెలకొందన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా గత వైసిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండా జాతికి అంకితం చేసిందని ఎద్దేవా చేశారు. ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు కోసం రూ. నాలుగు వేల కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయిందని విమర్శించారు. తమ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చిందన్నారు. నీటి అవసరాలు తీరినప్పుడే పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మార్కాపురంలో కొందరూ దేవాదాయ భూములను ఆక్రమించారని, గత ప్రభుత్వ అండతో ఇదంతా జరిగిందన్నారు. అలాంటి వారికి తరతరాల అడ్రస్ గల్లంతవుతుందని హెచ్చరించారు. దేవాదాయ శాఖ భూములు, ఇతర భూములను అన్యాక్రాంతం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

కెజిబివిలో ఫుడ్‌పాయిజన్



అస్వస్థతకు గురై పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

- 30 మంది విద్యార్థినులకు అస్వస్థత

ప్రజాశక్తి-సోమందేపల్లి (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని పాపరెడ్డిపల్లి కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ జరగడంతో 30 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి అన్నం, సాంబారు, రసం తిన్న అనంతరం విద్యార్థినులు వాంతులు, విరోచనాలకు గురయ్యారు. కొందరు జ్వరం బారిన పడ్డారు. ఈ విషయాన్ని వెంటనే పాఠశాల సిబ్బంది సోమందేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు తెలియజేశారు. వైద్య సిబ్బంది పాఠశాలకు వచ్చి విద్యార్థినులకు చికిత్స అందజేశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో జిల్లా విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే హస్టల్‌కు చేరుకొని తనిఖీలు చేపట్టారు.

టిడిపి.. వైసిపి ఘర్షణ

విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలియడంతో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పాఠశాలకు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సమయంలో మంత్రి సవిత అక్కడికి వస్తున్నట్లు సమాచారం రావడంతో అధికారులు ఉషశ్రీచరణ్‌ను పాఠశాల నుంచి వెళ్లిపోవాలని కోరారు. తానెందుకు వెళ్లాలంటూ ఉషశ్రీచరణ్ పోలీసులు, అధికారులతో వాదించారు. ఇదే సమయంలో అక్కడున్న టిడిపి నాయకులు ఉషశ్రీ చరణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వైసిపి నాయకులు మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు కలుగజేసుకుని అక్కడున్న వారందరిని పాఠశాల ఆవరణం నుంచి బయటకు పంపారు. పాఠశాల వద్ద జరుగుతున్న ఘర్షణను చిత్రీకరిస్తున్న ఓ విలేకరిపై టిడిపి నాయకులు దాడి చేశారు.

మంత్రి, ఎంపీ పరామర్శ

విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారధి గురుకుల పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాసంఘాల నాయకుల సందర్శన

పాపిరెడ్డిపల్లి కెజిబివి పాఠశాలను వ్యకాసం, కెవిపిఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పాపిరెడ్డిపల్లి కెజిబివి పాఠశాల నిర్వహణ పూర్తిగా రాజకీయ పెత్తనంలో నడుస్తోందన్నారు. విద్యార్థినులకు భోజనం సక్రమంగా ఇవ్వడం లేదని, నీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు.ఉన్నతాధి .కారులు పాఠశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎల్ఐసి నుంచి రెండు కొత్త బీమా పథకాలు

నవ జీవన్ శ్రీ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసి కొత్తగా రెండు ప్లాన్లను ఆవిష్కరించింది. నవ జీవన్ శ్రీ, నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం ప్లాన్లను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ ప్రభుత్వ రంగ సంస్థ శుక్రవారం వెల్లడించింది. రెండూ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, ఇండివిడ్యువల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్ స్కీములని పేర్కొంది. ఈ ప్లాన్లు జులై 4 నుంచి 2026 మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. "ఈ రెండు పథకాలు పాలసీదారుల పెట్టుబడికి భద్రతతో పాటు స్థిరమైన వడ్డీ లాభాలు కోరుకునే వారికి అనుకూలంగా ఉంటాయి. జీవిత బీమా రక్షణ కూడా అందిస్తాయి. ఈ పాలసీలో నెలకు రూ.10వేల చొప్పున 10 ఏళ్ల పాటు దాదాపు రూ.11 లక్షలు చెల్లిస్తే.. పాలసీ టర్మ్‌ను 20 ఏళ్లు ఎంచుకుంటే.. దాదాపు రూ.26 లక్షల మొత్తం చేతికి రానుందని అంచనా. నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం ఒకేసారి మొత్తం ప్రీమియం చెల్లించగలిగే వారికి ఇది ఉత్తమ ఎంపిక. 30 రోజుల వయసు నుంచీ 60 ఏళ్ల వరకు ఉన్న వ్యక్తులు ఈ పాలసీకి అర్హులు. మెచ్యూరిటీ వయసు 18 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 75 ఏళ్ల వరకు ఉండొచ్చు. పాలసీ వ్యవధి కనిష్ఠంగా 5 ఏళ్లు, గరిష్ఠంగా 20 ఏళ్ల వరకు ఉండేలా డిజైన్ చేశారు. కనీస హామీ మొత్తం రూ.1 లక్ష కాగా.. గరిష్ఠ పరిమితి ఉండదు." అని ఎల్ఐసి తెలిపింది.

సంపాదకీయం


జల చిచ్చు!

చిచ్చు రాజేసి చలి మంట కాచుకోవడం సంఘపరివార్‌కు ఆ కుదురు నుండి వచ్చిన వారికీ వెన్నతో పెట్టిన విద్య. ఉభయ తెలుగు రాష్ట్రాలమధ్య జలపంపిణీ అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం నడిపిస్తున్న ప్రక్రియ ఆ కోవలోనిదే! తెలుగు రాష్ట్రాల్లో ఎలాగైనా పట్టు పెంచుకోవాలన్న బిజెపి వ్యూహంలో భాగంగానే ఇలా వ్యవహరిస్తోందన్న వ్యాఖ్యానాలు సత్యదూరం కాదు. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాన్ని పరిష్కరించాల్సింది పోయి ఇంకా సాగతీసేందుకే కేంద్రం యత్నిస్తోంది. పోలవరం బనకచర్ల ప్రాజెక్టులో పర్యావరణ అంశంపై క్లారిటీ ఇవ్వాలని, మిగులు జలాలపై సిడబ్ల్యుసితో తేల్చుకుని రావాలని కేంద్ర పర్యావరణ ప్రభావ అంచనా కమిటీ రాష్ట్రానికి సూచిస్తూ మినిట్స్ కాపీని గతనెల 30వ తేదీన విడుదల చేసింది. సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించాల్సిన కేంద్రం ఆ పని చేయకుండా రెండు రాష్ట్రాలు తేల్చుకుని రావాలని సూచన చేయడంలోనే తాత్సారం చేయాలన్న కుట్ర దాగివుంది.

అయితే, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా తేల్చి, వివాదాలను పరిష్కరించాలని రెండు నెలల క్రితమే సిడబ్ల్యుసిని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. విభజన చట్టం ప్రకారం గోదావరి నికర జలాల్లో రాష్ట్రాల మధ్య పంపిణీపై స్పష్టత ఇవ్వాలని ఎపి ప్రభుత్వం ఈ ఏడాది మే మొదటివారంలో ఒకటి, 22వ తేదీన మరోలేఖ రాసింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం గోదావరి జలాల్లో ఎపి వాటా తేల్చాల్సిన బాధ్యత కేంద్రానిదేనని, దీనిపై సిడబ్ల్యుసి నివేదిక కూడా ఇవ్వాలని కోరింది. '2014లో రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఉభయ రాష్ట్రాల మధ్య జల వివాదాలతోపాటు అన్నిరకాల సమస్యలనూ పరస్పరం చర్చించి పరిష్కరించాలి. పదేళ్లు దాటితే సమస్యలన్నీ కేంద్రం చేతుల్లోకి వెళతాయి. అప్పటి నుండి కేంద్రమే వివాదాలను పరిష్కరించాల్సి ఉంది' అని కూడా ఈ లేఖలో వివరంగా పేర్కొన్నారు. తేల్చవలసిన కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్ర లేఖపై స్పందిస్తూ ఎగువ రాష్ట్రాల ఇఎన్‌సిల అభిప్రాయాన్ని కోరుతూ లేఖలు రాశామనీ, ఆ రాష్ట్రాల నుండి అభిప్రాయాలు వస్తే క్రోడీకరించి సిడబ్ల్యుసి సాంకేతిక అంశాల నివేదిక ఆధారంగా పంపిణీ ప్రతిపాదన చేస్తామని తెలిపింది. సమస్యను పరిష్కరించాల్సిన జలశక్తి శాఖ చోద్యంచూస్తుండగా అదే కేంద్ర ప్రభుత్వానికి చెందిన పర్యావరణ శాఖ ద్వారా నీటి కేటాయింపులు, పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలు తదితర అంశాలు ప్రస్తావించి జల వివాదాన్ని మరింత జఠిలం చేసింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయకుండా మౌనం వహించడం సరి కాదు. ఉభయ తెలుగు రాష్ట్రాలు సామరస్యంగా కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీపై అంగీకారానికి రావాలి. అయితే, అందుకు సుహృద్భావ వాతావరణంతోపాటు చట్ట, సాంకేతిక పరమైన విషయాలను కూడా పరిష్కరించుకోవాలి. ఇటువంటివాటికే కేంద్రం తోడ్పడాలి. విభజన చట్ట ప్రకారం ఆ బాధ్యతను నిర్వహించాలి.

అయితే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు నీటి ప్రైవేటీకరణకు రాచబాట వేస్తుందని వామపక్షాలు, పలువురు నీటిరంగ నిపుణులూ ఇప్పటికే చెబుతున్నారు. అంతేగాక ఇప్పటికే రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కోదానికి రెండు మూడువందల కోట్ల నుండి రెండు వేల కోట్లు చొప్పున ఖర్చు చేసి వాటిని పూర్తి చేయవలసింది పోయి ఏకంగా రూ.85 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును తలకెత్తుకోవడం ప్రభుత్వానికి విజ్ఞత కాదు. కృష్ణా, గోదావరి జల వివాద పంపిణీ ట్రిబ్యునళ్లు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు చారిత్రక, భౌగోళిక కారణాల మూలంగా నికర, మిగులు జలాల పంపిణీలో ప్రాధాన్యతనిచ్చాయి. మొదటిది ఆ నదులకు చివరి రాష్ట్రం కావడం, రెండవది దశాబ్దాల కిందటనే నీటిని వినియోగించుకున్నందున లభించే రైపేరియన్ రైట్స్. వాటి మూలంగా ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు ప్రజలంతా లబ్ధి పొందినమాట నిజం. అయితే, ఈ రెండు ప్రధానాంశాలూ ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు వర్తిస్తాయి. కాదనలేని ఈ సత్యాన్ని ఎవరూ విస్మరించరాదు. సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకొని, సముద్రంలో కలిసిపోతున్న నీటిలో కొంత భాగాన్నయినా పంట పొలాలకు మళ్లిస్తే అందరికీ మేలు జరుగుతుంది.

మంచి మాట



వ్యక్తి ప్రయోజనాల కన్నా సమాజ ప్రయోజనాలు అతి ముఖ్యం. ఈ రెంటికీ మధ్య న్యాయమైన, సమతుల్యమైన సంబంధాలు ఏర్పరచాలి.

- లెవిస్ హెన్రీ మోర్గాన్
సామాజిక సిద్ధాంతకర్త.

Lewis H. Morgan

బీహార్‌లో ఓట్లకు పెనుగండం - ఇసి తతంగం



PEOPLE'S DEMOCRACY

వ్యాఖ్య

ఈ పత్రాలు క్లుప్తంగా రాజకీయ పార్టీల సహకారాన్ని గురించి ప్రస్తావిస్తున్నా ఆచరణలో ఎన్నికల కమిషన్ వాటితో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఈ బృహత్ కసరత్తు ప్రారంభించింది. అక్రమ వలసదారుల గురించి ప్రస్తావించడం, చాలా కఠినమైన గుర్తింపు పత్రాలు అందించాలని కోరడం చూస్తే దొడ్డిదోవన పౌరసత్వ సవరణ చట్టం అమలు చేస్తున్నారా అనుకోవాల్సి వస్తుంది. ఈ మొత్తం తతంగంలో చిన్న, పెద్ద లొసుగులు ఇంకా అనేకం వున్నాయి. ప్రత్యేక ప్రగాఢ పరిశీలన ముసుగులో ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరిట భారీగానే ఓట్లను తొలగించడం జరుగుతుంది. దీనివల్ల బీహార్‌లోని పేద, శ్రామిక వర్గాలే ఎక్కువగా నష్టపోతాయి. ఎందుకంటే వారిలో అత్యధికులు వలసలు పోతుంటారు గనక...డిజిటల్‌గా గానీ, భౌతికంగా గానీ దీన్ని అందుకునే అవకాశం వుండదు.

న్యాయమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణలోనే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గుండెకాయ, ఆత్మ మనుగడ వుంటుంది. అదే అన్ని రాజకీయ పార్టీలకూ సమానావకాశాలకు హామీ కల్పించే అత్యావశ్యక ప్రక్రియగా వుంటుంది. ఈ లక్షణం కారణంగానే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఎన్నికల ప్రజాస్వామ్యంగా తరచూ పరిగణిస్తుంటారు. 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని ఆమోదించేందుకు ముందు రాజ్యాంగ పరిషత్తు శాసనసభలకు, పార్లమెంటుకూ న్యాయమైన స్వేచ్ఛాయుతమైన ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై రెండేళ్లపాటు ఎంతో లోతుగా చర్చించడం ఊరికే జరగలేదు.

సమగ్రమైన ఈ ముందస్తు ప్రణాళిక సహజంగానే ఎన్నికల నిర్వహణపై భారత ఎన్నికల సంఘం (ఇ.సి.ఐ) స్వతంత్రతకూ నిష్పాక్షిక పాత్రకూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. దానికి పూచీ కల్పించేలా ఇసిఐ రాజకీయ ప్రభావాల నుంచి నిపాక్షికంగా వుండేలా చూసేందుకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో నిమిత్తం లేకుండా అది స్వతంత్రంగా పని చేసేందుకుగాను దానికి విస్తారమైన, అవసరమైన అధికారాలు ఇచ్చింది. సర్వ సంపూర్ణమైన అధికారాలతో అది పని చేసే పరిస్థితి కల్పించింది.

భారత రాజ్యాంగం లోని 324వ అధికరణం ఈ అధికారాలను పొందుపర్చుకున్నది. పార్లమెంటుకూ శాసనసభలకు, రాష్ట్రపతి ఉప రాష్ట్రపతి స్థానాలకు సంబంధించిన ఎన్నికల నిర్వహణ పర్యవేక్షణ, నిర్దేశం, అదుపాజ్ఞలు అప్పగించింది. ఓటర్ల జాబితాల తయారీ, ఈ ఎన్నికల నిర్వహణ బాధ్యత కూడా ఎన్నికల సంఘానికే ఇవ్వబడింది.

గత 75 ఏళ్ల కాలంలోనూ ఎన్నికల సంఘం తగినంత సమగ్రతతో పారదర్శకతతో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా బాధ్యతలు నిర్వహించింది. కొన్ని స్వల్పమైన అపశ్రుతులు వున్నప్పటికీ ఇసిఐ భారత దేశంలోనూ, ప్రపంచ వ్యాపితంగానూ కూడా గౌరవం సంపాదించుకుంది.

మారిన దృశ్యం

ఇవన్నీ నిజమైనా నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి అధికారం చేపట్టాక ఈ ప్రక్రియ మారిపోయింది. కమిషన్ పొందికనే ఒక వివాదంగా తయారైంది. ముఖ్యంగా కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్‌నూ, ఎన్నికల కమిషనర్లనూ ఎంపిక చేసేందుకు బాధ్యత వహించే అన్వేషణ కమిటీలో ఎవరెవరికి చోటుండాలనే దానిపై సుప్రీం కోర్టు స్పష్టంగా చేసిన సిఫార్సులు ఉల్లంఘించబడ్డాయి. దాంతో ఈ ప్రక్రియ మొత్తం పూర్తిగా కార్యనిర్వాహకవర్గం ఉక్కు పట్టులోకి వచ్చేసినట్టయింది. అంతేగాకుండా మొదటి మోడీ ప్రభుత్వం ఎన్నికల కోసం కార్పొరేట్లు అంతులేని రీతిలో రాజకీయ విరాళాలు సమకూర్చే విషయమైన నిబంధనలకు అత్యంత ఘోరమైన సవరణలు తెచ్చింది. ఈ సవరణలతో ఎన్నికలకు పెట్టుబడి పెట్టే వ్యవహారం మొదలంటా మారిపోయింది. కార్పొరేట్ ప్రయోజనాలకూ ఎన్నికైన ప్రభుత్వాలకూ మధ్య ఇచ్చిపుచ్చుకునే లావాదేవీలు ప్రమాదకరంగా పరిణమించాయి.

ఎన్నికల బాండ్లకు వీలు కల్పించే నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమైనవంటూ సుప్రీం కోర్టు కొట్టివేయడంతో రాజకీయ నిధుల రహస్య నమూనా ఏమిటో ప్రజల ముందు బహిర్గతమైంది. ఇతర రాజకీయ పార్టీలతో పోలిస్తే బిజెపికి చాలా ఎక్కువ నిష్పత్తిలో సొమ్ములు సమకూరినట్టు సాక్ష్యాధారాలతో నిరూపితమైంది. అంతేగాక ఈ బాండ్ల వసూలు వెనక కీలకమైన ఆర్థిక అక్రమాలు బట్టబయలైనాయి. కుమ్మక్కుతో లావాదేవీలు జరిగిన తీరు కళ్లకు కట్టే ఆధారాలు అందుబాటులోకి వచ్చాయి.

ఇ.వి.ఎం లపై తీరని సందేహాలు

ఇవేగాక ఇంకా–ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇ.వి.ఎం), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వి.వి.ప్యాట్) వ్యవస్థ విశ్వసనీయత వంటి ఇతర సమస్యలు కూడా ప్రజావరణంలోకి వచ్చాయి. ఈ యంత్రం పనిని నిర్ణయించే సోర్స్ కోడ్, ప్రక్షాళన నియమావళి పారదర్శకతనూ నిజాయితీ వంతమైన నిర్వహణకూ కీలకం కాగా వాటి సాంకేతిక వివరాలకు సంబంధించి అనేకానేక ప్రశ్నలు కొనసాగుతూనే వున్నాయి. ఈ విధమైన ఆందోళన తీసుకొచ్చిన వివాదం ఇంకా నివృత్తి కావలసే వుంది.

ఇటీవలి సంవత్సరాలలో ముఖ్యంగా 2019 ఎన్నికల సన్నాహ దశలో ఎన్నికల సంఘం పక్షపాత పాత్ర అంతకంతకూ ఎక్కువగా ప్రదర్శితమైంది. ప్రధానినీ హోం మంత్రినీ కాపాడేందుకు పచ్చిగా ప్రయత్నాలు జరుగుతుంటే ఇసిఐ పట్టనట్టు కూర్చుండి పోయింది. పుల్వామా, బాలాకోట్ ఘటనలను రాజకీయమయం చేయకుండా అడ్డుకోలేక పోయింది. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ఆ విధంగా భద్రతా బలగాల కేంద్రకంగా వీర దురభిమాన జాతీయవాద కథనం తీసుకురావడం ఎన్నికల నిర్వహణ నియమావళికి (ఎంసిసి) దారుణంగా గండికొట్టింది.

ఈ కారణాల వల్ల అతి కీలకమైన సమస్య మన ముందుకొస్తుంది. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల పాత్రను వ్యవస్థీకరించడం ఎలాగన్నదే ఆ సమస్య. మొదటి నుంచి చూస్తే ఇసిఐ రాజకీయ పార్టీలతో సంప్రదింపులు, సూచనలతో కీలకమైన నిర్ణయాలు, చర్యలు చేపట్టడం రివాజుగా వస్తోంది. ఎంసిసి దానికదే ఒక రాజ్యాంగ నిబంధన కాదు. రాజకీయ తేడాలకు అతీతంగా ఏకాభిప్రాయ ప్రతిబింబంగానే అది నడుస్తూ వచ్చింది.

బీహార్‌లో దుస్సాధ్య ప్రక్రియ

బీహార్ శాసనసభ ఎన్నికలు జరగనుండగా ఓటర్ల జాబితాల తనిఖీ కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక ప్రగాఢ పరిశీలన) చేపట్టడమే ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్న అంశం. బీహార్ శాసనసభ కాలపరిమితి 2025 నవంబర్ 22తో ముగుస్తుంది. సహజంగా ఆ తేదీలోగా ఎన్నికలు జరపాలి. 2025 జూన్ 24న ఇసిఐ పరిశీలన ప్రక్రియను ప్రారంభించడం కోసం కావలసిన పత్రాలను ప్రకటించింది. దానిపై నాలుగు పేజీల పత్రికా ప్రకటన, బీహార్ ప్రధాన ఎన్నికల అధికారికి 19 పేజీల లేఖ విడుదల చేసింది. తొమ్మిది పేజీల మార్గనిర్దేశాలు, ఓటరు ధృవీకరణతో సహా ఓటరుగా ప్రకటనకు మద్దతుగా సమర్పించాల్సిన పత్రాల జాబితాతో పాటు రెండు పేజీల నమోదు పత్రం ప్రకటించింది.

సవివరమైన ఈ పత్రాల ప్రకటనే అనేక తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతున్నది. మొదటిది చరిత్ర క్రమానికి సంబంధించింది. ఈ పత్రికా ప్రకటన 2025 జూన్ 24న విడుదల కాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో పేరు నమోదు చేసుకోవడానికి గడువుగా ప్రకటించిన తేదీ 2025 జులై 1. ఈలోగా తాత్కాలికంగా ఓటర్ రిజిస్ట్రేషన్ అధికారులు ముందుగా రాసిపెట్టిన నమోదు పత్రాలను (డూప్లికేట్‌తో సహా) ఓటర్లందరికీ సిద్ధం చేసుకోవాలి. బూత్ లెవల్ ఆఫీసర్లకు (బి.ఎల్.ఒ) వాటిని పంపిణీ చేయాలి. బి.ఎల్.ఒ లకు శిక్షణ కూడా నిర్వహించాలి. మరోవైపున ఆ బి.ఎల్.ఒ లు ఇంటింటికి పంపిణీ చేసి భర్తీ అయిన వాటిని సేకరించాలి. పరిశీలించాలి. అంతేగాక పై స్థాయి అధికారులు హేతుబద్ధంగా వాటిని పునరేర్పాటు చేయాలి. ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణకు తుది రూపమివ్వాలి. పోలింగ్ కేంద్రాల జాబితాకు ఆమోదం పొందాలి. ముసాయిదా ఓటర్ల జాబితాలను 2025 ఆగష్టు 1 లోగా ప్రచురించాలి. 2025 సెప్టెంబరు 30 నాటికి తుది ఓటర్ల జాబితాలను ముద్రించాలి. ఆ తదుపరి రెండు మాసాలు అభ్యంతరాలు అభ్యర్థనల కోసం ఉద్దేశించబడింది.

భారీగా ఓట్ల గండం

దాదాపు విజ్ఞాన సర్వస్వాల లాగా కనబడే ఈ పత్రాలను పైపైన చూసినా అవెంత విపరీత తరహాలో వున్నాయో తెలుస్తుంది. వేగంగా పట్టణీకరణ, నిరంతరాయంగా వలసలు, కొత్త ఓటర్ల అర్హతలు, మరణాలు నమోదు కాకపోవడం, విదేశీ అక్రమ వలసదార్ల చేర్పింపు ఈ ముమ్మర పరిశీలనకు సమర్థనగా చెప్పడం కూడా అంతే విడ్డూరంగా వుంది. 2003 జనవరి 1వ తేదీని కొలబద్దగా ఈ ఓట్ల జాబితాలను తాజా పరచడం లక్ష్యంగా చెబుతున్నారు. ఈ సమస్యలు రెండు దశాబ్దాలుగా సాగుతున్నాయన్న మాట. ఈ తర్కం ప్రకారం చూసేట్టయితే గత 22 ఏళ్లుగా బీహార్‌లో జరిగిన ఎన్నికలన్నీ సక్రమంగా లేనట్టేనా? అలాంటి ఆరోపణ ఇప్పటివరకూ పాలించిన గత ప్రభుత్వాల చట్టబద్ధతను ప్రశ్నార్థకం చేసేదిగా వుంది.

ఈ పత్రాలు క్లుప్తంగా రాజకీయ పార్టీల సహకారాన్ని గురించి ప్రస్తావిస్తున్నా ఆచరణలో ఎన్నికల కమిషన్ వాటితో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఈ బృహత్ కసరత్తు ప్రారంభించింది. అక్రమ వలసదారుల గురించి ప్రస్తావించడం, చాలా కఠినమైన గుర్తింపు పత్రాలు అందించాలని కోరడం చూస్తే దొడ్డిదోవన పౌరసత్వ సవరణ చట్టం అమలు చేస్తున్నారా అనుకోవాల్సి వస్తుంది. ఈ మొత్తం తతంగంలో చిన్న, పెద్ద లొసుగులు ఇంకా అనేకం వున్నాయి. ప్రత్యేక ప్రగాఢ పరిశీలన ముసుగులో ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరిట భారీగానే ఓట్లను తొలగించడం జరుగుతుంది. దీనివల్ల బీహార్‌లోని పేద, శ్రామిక వర్గాలే ఎక్కువగా నష్టపోతాయి. ఎందుకంటే వారిలో అత్యధికులు వలసలు పోతుంటారు గనక...డిజిటల్‌గా గానీ, భౌతికంగా గానీ దీన్ని అందుకునే అవకాశం వుండదు.

మహారాష్ట్రకు రివర్స్ ప్రయోగం

ఇది ఒక విధంగా మహారాష్ట్రలో జరిగిన దాన్ని అటూ ఇటూ చేయడమే. అక్కడ లోక్‌సభ, శాసనసభ ఎన్నికల మధ్యలో కేవలం అయిదు మాసాల వ్యవధిలో 39 లక్షల ఓట్లను కొత్తగా చేర్చడం జనాభా తర్కానికి విరుద్ధంగా జరిగింది.

దీనంతటి తుది సందేశం బిగ్గరగా స్పష్టంగా కనిపిస్తూనే వుంది. చొరబాటు మిషతో కొత్తగా ప్రజల్లో విభజన తీసుకురావడమే. ప్రత్యేక ప్రగాఢ పరిశీలన ఈ ప్రస్తుత రూపంలో ముందుకు సాగడానికి వీల్లేదు. ప్రతిపక్షాలు దీనికి వ్యతిరేకంగా గొంతెత్తాయి. ఇప్పుడు బంతి పూర్తిగా ఇసిఐ కోర్టులో వుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగ స్ఫూర్తిని వదులుకోవడం సరైంది కాదు.

(జులై2 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల

మారని పాలకుల విధానాలు




ముప్పై సంవత్సరాల నుండీ పనిచేస్తున్న కంటింజెంట్, పార్ట్‌టైం, దినసరి, కన్సాలిడేటెడ్ తదితర ఉద్యోగులనూ రెగ్యులర్ చెయ్యలేదు. వీరు చనిపోతున్నా, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నా ఈ పాలకులు పట్టించుకోవడం లేదు. దాదాపు 2 దశాబ్దాలుగా సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ తదితర పై ప్రభుత్వ పథకాలు, సంస్థల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చెయ్యడం లేదు. కేంద్ర గైడ్‌లైన్స్ ప్రకారం హెచ్.ఆర్ పాలసీ అమలు చెయ్యాల్సి ఉన్నా నేటికీ రెండు పథకాల్లో మినహా మిగిలిన పథకాల్లో హెచ్‌ఆర్ పాలసీని రూపొందించలేదు. వీరందర్నీ ఇతర రాష్ట్రాల్లో వలె రెగ్యులర్ చెయ్యాలి. ఇన్నేళ్లు వీరంతా ప్రజల కోసం పని చెయ్యడానికి అర్హులైనప్పుడు రెగ్యులరైజేషన్‌కు ఎందుకు అర్హులు కారు?

సమస్య

గత రెండున్నర దశాబ్దాలుగా రాష్ట్రంలో పాలకులు మారినా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, దినసరి, కంటింజెంట్, టైంస్కేల్, గౌరవ వేతన ఉద్యోగుల జీవితాల్లో పెద్దగా మార్పు రాలేదు. ఈ కాలంలో అధికారంలో ఉన్న పార్టీలు మారినా పై ఉద్యోగుల ఎడల వీరి విధానాలు ఒకటే కావడం వలన వీరు రెగ్యులర్ కాలేదు. సమాన పనికి – సమాన వేతనం, సమాన సౌకర్యాలు అమలు చేయలేదు.

రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు, పథకాలు, యూనివర్సిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థలు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పని చేయించుకొంటున్న ప్రభుత్వాలు, వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలను చెల్లించకుండా అమానుషంగా వ్యవహరిస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలనూ ఈ ఉద్యోగులకు అమలు చెయ్యకుండా ఆదర్శ యజమానిగా వ్యవహరించాల్సిన ప్రభుత్వమే నేడు చట్టం ముందు దోషిగా నిలిచింది. కాంట్రాక్ట్ ఉద్యోగులకు పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ వంటి సౌకర్యాలను అమలు చేయడంలేదు. ఎన్నికల ముందు హామీలివ్వడం అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకపోవడం పరిపాటిగా మారింది.

గత ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కాస్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న దాదాపు లక్ష మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ ఆప్కాస్‌ను రద్దు చేసి తిరిగి ప్రైవేట్ ఏజెన్సీల వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నం చేయడం సరైనది కాదు. ఉద్యోగులు ఆందోళనలు నిర్వహించడంతో టిడిపి కూటమి ప్రభుత్వం దీనిపై అధ్యయనానికి కమిటీ వేసింది.



ఎ.వి. నాగేశ్వరరావు

సుప్రీంకోర్టు సివిల్ అప్పీల్ 213 ఆఫ్ 2013లో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న వివిధ తాత్కాలిక క్యాడర్ల ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల కనీస బేసిక్ (మినిమం టైం స్కేల్)ను అమలు చెయ్యాలని తీర్పునిచ్చింది. కాంట్రాక్ట్ లేబర్ (ఎబాలిషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం 1970 ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు అమలు చెయ్యాలి. కాని వీటన్నింటినీ ప్రభుత్వాలు అమలు చెయ్యకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వివక్ష చూపుతున్నది. తక్కువ వేతనాలతో పని చేయించుకుంటూ దోపిడీ చేస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, వెలుగు, 108, 104, ఆరోగ్యమిత్ర, కస్తూరిబా, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఆయుష్, ఎ.పి సాక్స్ తదితర ప్రభుత్వ పథకాల్లోని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్‌కు, మున్సిపల్, పంచాయితీ, విద్యుత్తు, ఆర్టీసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీల్లో కనీసం మినిమం టైం స్కేల్‌ను అమలు చెయ్యడం లేదు. ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి (2008) వీరందరికీ మినిమం టైం స్కేల్ అమలయ్యేది. కాని గత వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ శాఖల్లోని డైరెక్ట్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే టైం స్కేల్‌ను పరిమితం చేసింది. దీనివలన ప్రభుత్వ శాఖల్లోని ఔట్‌సోర్సింగ్ మరియు పై పథకాలు, సంస్థల్లోని 2.5 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర క్యాడర్ల ఉద్యోగులకు అన్యాయం చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా మినిమం టైం స్కేల్‌ను పునరుద్ధరిస్తుందని ఈ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

చాలీచాలని వేతనాలతో బతుకులీడుస్తున్న ఔట్‌సోర్సింగ్ తదితర పై కేటగిరీల ఉద్యోగులకు గత, ప్రస్తుత పాలకులు కనీసం సంక్షేమ పథకాలనూ అమలు చేయడం లేదు. తెలుగుదేశ కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని మానిఫెస్టోలో ప్రకటించినా నేటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదు.

అనేక సంవత్సరాలుగా పనిచేయించుకుంటున్న పై ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యడం లేదు. గత ప్రభుత్వం 2014కు ముందు నుండీ పనిచేస్తున్న 10,177 మంది ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని జీఓ లు ఇచ్చినా, వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమంలోని 4 వేల మంది ఉద్యోగులను మాత్రమే రెగ్యులర్ చేసింది. విద్యాశాఖ, పాలిటెక్నిక్ లలోని కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఇతర శాఖల్లోని దాదాపు 6 వేల మందిని రెగ్యులర్ చెయ్యలేదు. అధికారులు ఎప్పటికప్పుడు సక్రమంగా వీరికి రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయకుండా కొనసాగించడం తదితర కుంటి సాకులతో వీరిని రెగ్యులర్ చెయ్యలేదు. అధికారుల తప్పిదాలకు కాంట్రాక్ట్ లెక్చరర్లను బలి చెయ్యడం సమంజసం కాదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయినా వీరి రెగ్యులరైజేషన్‌లో ఒక్క అడుగూ ముందుకు వేయలేదు.

1994కు ముందు నుండీ అంటే 30 సంవత్సరాల నుండీ పనిచేస్తున్న కంటింజెంట్, పార్ట్‌టైం, దినసరి, కన్సాలిడేటెడ్ తదితర ఉద్యోగులనూ రెగ్యులర్ చెయ్యలేదు. వీరు చనిపోతున్నా, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నా ఈ పాలకులు పట్టించుకోవడం లేదు. దాదాపు 2 దశాబ్దాలుగా సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ తదితర పై ప్రభుత్వ పథకాలు, సంస్థల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చెయ్యడం లేదు. కేంద్ర గైడ్‌లైన్స్ ప్రకారం హెచ్.ఆర్ పాలసీ అమలు చెయ్యాల్సి ఉన్నా నేటికీ రెండు పథకాల్లో మినహా మిగిలిన పథకాల్లో హెచ్‌ఆర్ పాలసీని రూపొందించలేదు. వీరందర్నీ ఇతర రాష్ట్రాల్లో వలె రెగ్యులర్ చెయ్యాలి. ఇన్నేళ్లు వీరంతా ప్రజల కోసం పని చెయ్యడానికి అర్హులైనప్పుడు రెగ్యులరైజేషన్‌కు ఎందుకు అర్హులు కారు?

ఉద్యోగులంతా ఐక్యమై, ఐక్య పోరాటాలు సన్నద్ధమైతేనే పై సమస్యలు పరిష్కారమవుతాయని గ్రహించాలి. అలాంటి ఐక్య పోరాటాలకు సన్నద్ధమవ్వాలి. సమస్యల పరిష్కారానికి జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలి.

/ వ్యాసకర్త ఎ.పి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ జె.ఎ.సి చైర్మన్ /

ఒక్క ఉద్యోగం ఇవ్వని ఏడాది పాలన

సమస్య

వంద ఆశలతో యువతీ, యువకులు టిడిపి కూటమి ప్రభుత్వాన్ని భుజాన వేసుకొని గెలిపించారు. వయస్సు మించి పోతున్నా ఉపాధి లేక అల్లాడిపోతున్న నిరుద్యోగుల కసి ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. గడిచిన ఏడాదిగా రోజూ పేపర్‌లో బాబుగారు చెప్పే ఉపాధి నిరుద్యోగి వరకు రావడం లేదు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, స్కిల్ సెంటర్ వంటి హామీలు అమలుకు నోచుకోలేదు. నిరుద్యోగ యువత ఆశలన్నీ నీరుగారి పోతున్నాయన్న ఆందోళన మొదలైంది.

ఏడాదిలో ఊడగొట్టిన ఉద్యోగాలు 3 లక్షలు

ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్, 20 లక్షల ఉద్యోగాలు అని ప్రచారం చేసిన పార్టీలు అధికారం చేపట్టాయి. గత ప్రభుత్వం ఇచ్చిన ఎ.పి.పి.ఎస్.సి నోటిఫికేషన్లకు ఇప్పటికీ పరీక్షలు పూర్తిచేయలేదు. కానిస్టేబుల్ నియామకాలు పెండింగ్ లోనే కొనసాగుతున్నాయి. తొలి సంతకం పెట్టిన డిఎస్సీ పరీక్ష నిర్వహించడానికి ఏడాది దాటింది. గతం లోనివి పూర్తి చేయలేదు సరికదా ఈ కాలంలో దాదాపు మూడు లక్షల ఉద్యోగాలు ఊడగొట్టింది. ఖనిజాభివృద్ధి సంస్థలో రెండు దఫాలుగా 185 పోస్టులు, సంచార పశు ఆరోగ్య శాఖలో 1,962 ఉద్యోగాలు, రైస్ వాహనాలు (ఎం.డి.యు) వాహన డ్రైవర్లు 9,260 (హెల్పర్లు 18,000), లిక్కర్ షాపు సూపర్‌వైజర్లు 3,500, సేల్స్‌మెన్ 12,363 మందిని అధికారం చేపట్టాక 2.50 లక్షల మంది వలంటీర్లను త్రిశంకుస్వర్గంలో పెట్టారు. పెండింగ్ వేతనాలు కూడా ఇవ్వలేదు. రేషనలైజేషన్ పేరుతో గ్రామ, వార్డు సచివాలయాల్లో 25 వేల ఉద్యోగాలు కుదిస్తున్నారు. మొత్తంగా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా పై ఉద్యోగాలన్నీ తొలగించింది. ఏడాది పాలనలో తొలగింపుల ప్రభుత్వంగా మారింది.

పెట్టుబడుల ద్వారా వచ్చిన ఉద్యోగాలెన్ని?

ఏడాది కాలంలో రాష్ట్రంలో 9 లక్షల కోట్ల పైన పెట్టుబడులు ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం తన ఏడాది పాలన ప్రకటనలో పేర్కొంది. దీనిద్వారా మూడు లక్షల ఉద్యోగాలకు అవకాశాలు వచ్చినట్లు పేర్కొంది. వాస్తవంగా వచ్చినవి ఎన్ని? అవి ఎక్కడా అనేది పేర్కొనలేదు. పి4 సర్వే ద్వారా రాష్ట్రంలో 1.56 కోట్ల మంది ఉపాధి లేనివారని కూటమి ప్రభుత్వం తేల్చింది. 18–50 ఏళ్ల మధ్య పని చేయడానికి సిద్ధంగా ఉన్నవారు 52.74 లక్షల మందని పేర్కొంది. రాష్ట్రంలో ఇంతమంది నిరుద్యోగ సైన్యం ఉంటే వీరందరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యం కన్నా పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకే ముఖ్యమంత్రి గారు ఎక్కువగా కష్టపడుతున్నారు. పెట్టుబడుల సాధన పేరుతో పేదల భూములు పందేరం పెట్టి దాదాపు 15 పాలసీలను విడుదల చేసింది. కోరినన్ని రాయితీలు ప్రకటించింది. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని నిర్ణయం కూటమి ప్రభుత్వం చేసింది. మోడీ తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ల అమలు పేరుతో పనిగంటలను పదికి పెంచింది.

తొలి సంతకం డిఎస్సీ అయినా పూర్తవుతుందా?

ఏడాది తరువాత జరుగుతున్న డిఎస్సీ పరీక్షలు ఇంకా ముగియలేదు. ఈలోపే ఉపాధ్యాయ బదిలీలు పూర్తయిన తరువాత పోస్టింగు ప్లేస్ లేక ప్రభుత్వం వద్ద 1,200 మంది ఉపాధ్యాయులు మిగిలిపోయారు. ఉన్నవారికే పోస్టింగ్ లేకపోతే కొత్తగా రాబోతున్నవారి పరిస్థితి ఏమిటి? ఈ పరిస్థితికి కారణం ప్రభుత్వం పాఠశాలలను మూసివేయడమే. వాస్తవంగా కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు బదిలీలు చూస్తే ఉన్న పోస్టులే మిగిలిపోయాయి. అంటే ఈ పోస్టులన్నీ ఏమయ్యాయి? వైసిపి ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా పాఠశాలలను తగ్గించడం ద్వారా, రేషనలైజేషన్ ద్వారా పోస్టులను కుదించిన ఫలితమే ఇది. ఎన్నో ఆశలతో ఎనిమిదేళ్ళ తరువాత డిఎస్సీ పరీక్ష రాస్తున్న అభ్యర్థుల భవితవ్యం ఏమిటి? వాస్తవంగా విద్యా హక్కుచట్టం ప్రకారం తరగతికి ఒక టీచర్ చొప్పునైతే వేలాది పోస్టులు కావాలి. కానీ మోడీ ప్రభుత్వం ఆదేశాలతో నూతన విద్యా విధానం అమలు, రేషనలైజేషన్‌తో పోస్టులు కుదించిన కారణంగా మన రాష్ట్రంలో డిఎడ్, బిఇడి పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

స్పెషల్ డిఎస్సీ హామీ గాలికే

ఎన్నికల్లో గిరిజన ప్రాంత పర్యటన సందర్భంగా చంద్రబాబు నాయుడు గిరిజనులకు స్పెషల్ డిఎస్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. దాని ప్రకారం 16,000 పోస్టులలో భాగంగానే స్పెషల్ డిఎస్సీ కూడా నోటిఫికేషన్ ఇవ్వాలి. కానీ ఆపని చేయలేదు. "హామీ అమలు చేయాలి, జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలి" అని ఏజెన్సీ మొత్తం గిరిజన ప్రజానీకం, నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో పోరాడుతున్నా పట్టించుకోలేదు. గిరిజన యువతను మోసం చేశారు. నిరుద్యోగ భృతి రూ.3,000 ఇవ్వలేదు. జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. స్కిల్ సెంటర్లు చర్చలకే పరిమితం. "అడగందే అమ్మయినా పెట్టదంటారు" అడిగినా ఇచ్చిన హామీలు, అమలు చేయకపోవడం బాబు నైజం.

నిరుద్యోగులు ఏం చేయాలి?

ఉపాధి కల్పించాలన్న స్పృహ టిడిపి కూటమి ప్రభుత్వానికి ఉంటే రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలెన్ని అన్న అంశంపై ఒక్కసారైనా రివ్యూ చేసేవారు. ఆ పని చేయలేదు. సచివాలయాల్లో 25 వేలు కుదించేవారు కాదు. దీనిని బట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన మీద ఈ ప్రభుత్వానికి శ్రద్ధ లేదు. గత ప్రభుత్వం మోసం చేసిందని యువత ఈ ప్రభుత్వాన్ని భుజాన వేసుకొని మరీ గెలిపించారు. ఏడాది చూశారు. నిరుద్యోగులకు ఉపశమనమేమీ కనిపించడంలేదు. చూస్తూనే మరో ఏడాది నిరుద్యోగ వయో పరిమితి పెరిగింది. ప్రిపరేషన్‌లకు అప్పులు పెరిగాయి. ఉద్యోగం మాత్రం రాలేదు. కాబట్టి మరో పోరాటమే సరైన మార్గమవుతుంది. సిద్ధపడండి.

- యం. సూర్యారావు

పి4 సమర్థవంతంగా అమలుకు రెండు కమిటీలు

- బంగారు కుటుంబాలకు సంక్షేమంలో కోత ఉండదు
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- లోగో ఖరారు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పి-4 పథకం సమర్థవంతంగా అమలు చేసేందుకు రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. చంద్రబాబు నేతృత్వంలో పి4 జనరల్ బాడీ సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పి4 లోగోను ముఖ్యమంత్రి ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4 విధానం ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపాలని చెప్పారు.

పేదరికంపై యుద్ధం చేస్తేనే చరిత్ర సృష్టించగలమని తెలిపారు. ఈ పథకం స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు. ఆగస్టు 15 నుంచి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్షమంది మార్గదర్శులను గుర్తించేలా లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చే మార్గదర్శుల పాత్రపై మరింత స్పష్టతకు రావాలని చెప్పారు. బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా, వారి కాళ్లపై వాళ్లు నిలబడేలా మార్గదర్శులు గైడ్ చేస్తూ ఉండాలని తెలిపారు. వివిధ నియోజకవర్గాల పరిధిలో ఉండే ఎన్ఆర్ఐలు, వివిధ పరిశ్రమలు, ధనవంతులను గమనించి వివిధ రూపాల్లో పేదలకు సేవలు అందించే వారిని గుర్తించండని చెప్పారు. సంక్షేమం అందిస్తే పేదరికం పోదని, పేదల ఆర్థిక ఎదుగుదలకు సరైన సమయంలో సరైన గైడెన్స్ అవసరమని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 6-10వేల పేద కుటుంబాలకు బంగారు కుటుంబాలుగా ఎంపిక కానున్నాయని వెల్లడించారు. ఎమ్మెల్యేలకు ఇంతకు మించిన పెద్ద అవకాశం ఉండదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పి4 జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్
- బోస్టన్ గ్రూప్ చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడలోని జెఎన్‌టియుకె 11వ స్నాతకోత్సవం యూనివర్సిటీ అలూమినీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవానికి అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. అనంతరం ముఖ్యఅతిథి కోట సుబ్రహ్మణ్యం మాట్లాడారు. సాంకేతిక రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అగుమెంటెడ్ రియాల్టీలపై దృష్టి పెట్టాలన్నారు. స్టార్టప్‌ల కోసం ఏర్పాటయ్యే ఇంక్యుబేషన్ సెల్స్ విశిష్టతను వివరించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్, ఎఐ, ఐఒటి, ఇ-మొబిలిటీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ, పరిశోధన, సరికొత్త బోధనా పద్ధతులతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

క్వాంటమ్ మిషన్ వల్ల 2026 నాటికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ వ్యవస్థాపకత, పరిశ్రమలతో అనుసంధానమై సిలబస్‌ను రూపొందించడం ద్వారా పట్టభద్రులు ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కొనేలా తయారవుతారని చెప్పారు.. అనంతరం రీసెర్చ్ స్కాలర్లకు పిహెచ్‌డిలు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.షాన్‌మోహన్, ఎమ్మెల్సీ పద్మశ్రీ, విసి సిఎస్ఆర్‌కె.ప్రసాద్, రెక్టార్ కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ, ఒఎస్ డి.కోటేశ్వరరావు, డైరెక్టర్లు, జెఎన్‌టియుకె ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ నజీర్

తూనికలు, కొలతల పరికరాల స్టాంపింగ్‌కు ఫీజుల పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తూనికలు, కొలతల శాఖలో తూనికలు, కొలతల పరికరాల ధ్రువీకరణ, స్టాంపింగ్ కోసం చెల్లించాల్సిన ఫీజులు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి సౌరబ్‌గౌర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2011లో తూనికలు, కొలతల పరికరాల ధ్రువీకరణ, స్టాంపింగ్‌కు నిర్ణయించిన ఫీజులను సవరిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ధరల పెంపుపై అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలనుకున్న వారు నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 15 రోజులలోపు కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామంలోని పౌరసరఫరాలశాఖ కమిషనర్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. గడువు లోపు అందిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తూనికలు, కొలతల పరికరాలకు సంబంధించి ఏపి పరికరాల ధ్రువీకరణ, స్టాంపింగ్‌కు ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, పెంచిన ఫీజుల వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

క్వార్టర్స్‌కు సుబ్రమణియన్

- కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఒట్టావో(కెనడా): కెనడా ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో మరో భారత షట్లర్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. శుక్రవారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో ఎస్.సుబ్రమణియన్ 21-19, 21-14తో వై.కె.హంగ్(చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు. తొలి గేమ్‌లో పోరాడి నెగ్గిన సుబ్రమణియన్.. రెండో గేమ్‌లో మరింత పుంజుకొని మ్యాచ్‌ను ముగించాడు. కిదాంబి శ్రీకాంత్ ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన సంగతి తెలిసిందే. శనివారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో సుబ్రమణియన్ జపాన్‌కు చెందిన నిషిమోటోతో, కిదాంబి శ్రీకాంత్ తైపీకి చెందిన ఛో-టిన్-చెన్‌తో తలపడనున్నాడు.



ప్రపంచదేశాలకు కొత్త సుంకాలపై ట్రంప్ లేఖలు

- గడువుకన్నా ముందే నిర్ణయాల వెల్లడి

వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై ప్రకటించిన ప్రతీకార సుంకాల వివరాలతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆయా దేశాలకు లేఖలు రాస్తున్నారు. అమెరికాతో ఒప్పందాలకు జులై 9వరకు గడువు ఉన్నా, అంతకంటే ముందే కొత్త టారిఫ్ రేట్లను పేర్కొంటూ లేఖలు రాస్తున్నారు. శుక్రవారం నుంచి తమ వాణిజ్య భాగస్వాములకు ఈ లేఖలను పంపుతామని ఆయన ప్రకటించారు.

"అమెరికాతో వాణిజ్యం చేయాలంటే సుంకాలు ఎంత చెల్లించాలన్న దానిపై ఆయా దేశాలకు లేఖలు పంపనున్నాం. శుక్రవారం నుంచి నుంచి రోజుకు 10 దేశాల చొప్పున వీటిని పంపిస్తాం" అని ఆయన విలేకరులకు చెప్పారు. టారిఫ్‌లపై ఉన్న డెడ్‌లైన్‌ను పొడిగించవచ్చు లేదా కుదించవచ్చు అని కూడా చెప్పుకొచ్చారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2న ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్, చైనా సహా పలు దేశాలపై భారీగా సుంకాలు విధించారు. అనంతరం ఆయా దేశాలతో ఎగుమతులు, దిగుమతుల టారిఫ్‌లపై నిర్ణయం తీసుకోవడం, వాణిజ్య ఒప్పందం చేసుకోవడం కోసం 90 రోజుల పాటు గడువు (జులై 9వ తేదీ వరకు) విధిస్తూ సుంకాల అమలును తాత్కాలికంగా నిలిపివేశారు.

డెడ్‌లైన్‌లోగా అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకోకపోతే.. ఆయా దేశాలపై తమ ఇష్టానుసారం సుంకాలను విధిస్తామని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. ఈ క్రమంలోనే భారత్, చైనా, బ్రిటన్ వంటి దేశాలు అగ్రరాజ్యంతో వాణిజ్య చర్చలు జరిపాయి. ఇప్పటికే కొన్ని కొలిక్కిరాగా.. భారత్‌తో చర్చలు కొనసాగుతున్నాయి. రెండు రోజుల్లోగా ఇరుదేశాల మధ్య మినీ ట్రేడ్ డీల్ కుదిరే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. అటు చైనాతో ఒప్పందం కుదిరినట్టు ఇటీవల ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన సంగతి తెలిసిందే.


మాజీ సీఎం రోశయ్య జీవితం ఆదర్శనీయం

- ఇక నుంచి అధికారికంగా ఆయన వర్ధంతి, జయంతి
- జయంతి వేడుకల్లో తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- లక్డీకాపూల్ రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఏఐసిసి అధ్యక్షులు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం కొణిజేటి రోశయ్య నేటి తరానికి ఆదర్శనీయమని తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. ఇక నుంచి ప్రభుత్వం అధికారికంగా ఆయన వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లక్డీకాపూల్ చౌరస్తాలో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎం ఎ.రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రోశయ్య మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో మాజీ సిఎం 92వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రోశయ్య రాజకీయ జీవితానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సన్మానించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ...సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నేతగా ఆయన పేరొందారన్నారు. ఆయన ఏనాడూ పదవులను కోరుకోలేదని, పదవులే ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయని గుర్తుచేశారు. 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం మామూలు విషయం కాదన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ...రోశయ్య పరిపాలనా దక్షతగల నాయకుడని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టకుండా జాగ్రత్తగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన మహనీయుడని కొనియాడారు. మాజీ ఎంపి కెవిపి రామచందర్‌రావు మాట్లాడుతూ...రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

ఆంధ్రకు చెందిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ...నేడు రాజకీయ వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని, ముఖ్యంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో రాజకీయాలు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీల యువనేతలు రోశయ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. అప్పులు చేయకుండా ప్రజాయుత బడ్జెట్‌ను రూపొందించడంలో రోశయ్య దిట్ట అని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కొనియాడారు. ప్రభుత్వాల్లోని సంక్షేమ పథకాల అమలు భారంగా మారిందని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలుగువాళ్లు ఒకరినొకరు గౌరవించుకోవడంలో భాగంగానే మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఖర్గే, తెలంగాణ సిఎం రేవంత్,మంత్రులు తదితరులు

సెన్సెక్స్ 193 పాయింట్ల పెరుగుదల

న్యూఢిల్లీ : అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదరనుందనే అంచనాల్లో వారాంతంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. దీంతో శుక్రవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 193 పాయింట్లు లేదా 0.23 శాతం పెరిగి 83,432కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 56 పాయింట్లు లాభపడి 25,461 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.03 శాతం చొప్పున పెరిగాయి. ఆటో, లోహ సూచీలు ప్రధాన లాభపడ్డాయి. సెన్సెక్స్–30లో 20 స్టాక్స్ సానుకూలంగా.. మిగితా 10 నష్టాలను చవి చూశాయి. బజాజ్ ఫిన్సెర్వ్, ఇన్ఫోసిస్, హెచ్‌యుఎల్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌సిఎల్ టెక్ సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి.

అమెరికాపై ప్రతీకార సుంకాలు

- డబ్ల్యుటిఒ నిబంధనల కింద భారత్ ప్రతిపాదన

న్యూఢిల్లీ : భద్రతా చర్యల పేరుతో భారత్ ఆటోమొబైల్ రంగ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధించినందుకు ప్రతిగా డబ్ల్యుటిఒ నిబంధనల కింద అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించాలని భారత్ శుక్రవారం నాడు డబ్ల్యుటిఒలో ప్రతిపాదించింది. 'అమెరికా నుండి వచ్చే ఉత్పత్తులపై ఎంపిక చేసిన వాటిపై టారిఫ్‌లు పెంచే రూపంలో ఈ ప్రతిపాదిత రాయితీలను నిలిపివేయడమనేది వుంటుంది' అని డబ్ల్యుటిఒ విడుదల చేసిన నోటిఫికేషన్ పేర్కొంది. భారత్ అభ్యర్థన మేరకు ఈ నోటిఫికేషన్‌ను డబ్ల్యుటిఒ సభ్యులకు పంపిణీ చేశారు. డబ్ల్యుటిఒకి చెందిన నిర్దిష్ట నిబంధనల కింద రాయితీలను, అలాగే ఇతర బాధ్యతలను నిలిపివేయడం గురించి భారత్ ముందుగానే డబ్ల్యుటిఒ వాణిజ్య కౌన్సిల్‌కు తెలియచేసింది. భారత్ నుండి వచ్చే ఆటోమొబైల్ విడిభాగాలపై అమెరికా విధించిన భద్రతా చర్యలకు సంబంధించి ఈ చర్య తీసుకుంటున్నట్లు భారత్ తెలిపింది. ఆటోమొబైల్ విడిభాగాలకు సంబంధించిన ఈ చర్యలు మే 3 నుండి అమల్లోకి వచ్చాయి. కాగా అమెరికా ఈ చర్యల గురించి డబ్ల్యుటిఒకు తెలియచేయలేదు. గాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్)–1994, భద్రతా చర్యలపై ఒప్పందానికి తగిన విధంగా అమెరికా తీసుకున్న చర్యలు లేవని భారత్ విమర్శిస్తోంది. ఈ టారిఫ్‌లపై భారత్ కోరినప్పటికీ చర్చలు జరగలేదని, అందువల్ల రాయితీల సస్పెన్షన్‌పై తన హక్కును భారత్ అట్టిపెట్టుకుందని ఆ నోటిఫికేషన్ పేర్కొంది.

పలాస వైఎస్‌ఆర్ కిడ్నీ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

- మంత్రికి లేఖలో ప్రజారోగ్య వేదిక

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా పలాసలోని డాక్టర్ వైఎస్‌ఆర్ కిడ్నీ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని, ఉద్దానంలో క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సికెడి)పై పరిశోధనను వేగవంతం చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణయ్య, టి కామేశ్వరరావు శుక్రవారం లేఖ రాశారు. ఉద్దానంలో సికెడి 18 నుంచి 22 శాతం ఉందని, ఇది దేశ సగటు కంటే చాలా అధికమని లేఖలో పేర్కొన్నారు. ఉద్దానం ప్రపంచంలోనే సికెడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఒకటని, ముఖ్యంగా బాధితుల్లో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులని తెలిపారు. ప్రజారోగ్య వేదిక ఇటీవల పలాస వైఎస్‌ఆర్ కిడ్నీ ఆస్పత్రిని సందర్శించినప్పుడు, రోగులకు సరైన సేవలు అందించడంలో కొన్ని లోపాలను గుర్తించామని, వీటి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రి పలాస పట్టణానికి దూరంగా ఉండటం, ప్రజా రవాణా సౌకర్యం లేకపోవడంతో రవాణా కోసం ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో కొందరు డయాలసిస్‌కు రాలేకపోతున్నారని చెప్పారు. ఆస్పత్రిలో సురక్షిత తాగునీరు అందుబాటులో లేదని, ప్రస్తుతం ఆర్‌ఒ నీరు కేవలం డయాలసిస్ రోగులకు మాత్రమే ఇస్తున్నారని, సికెడి రోగులకు సరసమైన, పోషకాలున్న ఆహారం అందించే క్యాంటీన్ లేదని, దీనివల్ల నాణ్యమైన ఆహారం అందుబాటులో లేదన్నారు. తాత్కాలిక సిబ్బందిపై ఆధారపడటం వల్ల సేవల్లో ఆలస్యం, నాణ్యత తగ్గుతోందని పేర్కొన్నారు. నెఫ్రాలజీ విభాగంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సౌకర్యం లేదని, దీనివల్ల చాలా రోజులు ఖరీదైన చికిత్స కోసం బయటకు వెళ్లాల్సి వస్తోందన్నారు. యూరాలజీ విభాగం పూర్తి స్థాయిలో లేకపోవడంతో సంబంధిత చికిత్సలు అందడం లేదన్నారు. ఉద్దానం నెఫ్రోపతి కారణాల గురించి ఏళ్ల తరబడి పరిశోధన జరుగుతున్నా ఇప్పటి వరకూ ఎటువంటి పురోగతి లేదని తెలిపారు. ఐసిఎంఆర్ వంటి సంస్థలతో కలిసి పరిశోధన వేగవంతం చేయాలని కోరారు. ప్రజారోగ్య వేదిక గుర్తించిన సమస్యలపై తగిన చర్యలు తీసుకుని తక్షణమే పరిష్కరించాలని లేఖలో పేర్కొన్నారు.

హిమాచల్‌లో జలవిలయం

- 63 మంది మృతి.. రూ.400 కోట్ల ఆస్తి నష్టం

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌ను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేశాయి. ఇటీవల ఎడతెరిపిలేకుండా కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌ను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీంతో హిమాచల్‌ప్రదేశ్‌కు భారీ ఆస్తి, ప్రాణ నష్టం ఏర్పడింది. బియాస్ సహా పలు నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పలు ప్రాంతాల్లో భారీ వరదలు సంభవించాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నట్టు హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. వరదలు కారణంగా ఇప్పటివరకు 63 మంది మరణించినట్టు సర్కార్ అధికారికంగా ప్రకటించింది. వరదల ధాటికి వంద మందికి పైగా గాయపడ్డారని, పదుల సంఖ్యలో పౌరులు వరదల్లో గల్లంతైనట్టు పేర్కొంది. వారికోసం సహాయక బృందాలు కొనసాగుతోన్నట్టు తెలిపింది. వరదల వల్ల దాదాపు రూ.400 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిలినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నష్టం మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పునరుద్ధరణ చర్యలపై ప్రాథమికంగా దృష్టి పెట్టినట్టు అధికారులు చెప్పారు. జులై 7 వరకు హిమాచల్‌లోని అన్ని జిల్లాల్లో భారీ వర్ష సూచన హెచ్చరికలు చేసినట్టు తెలిపారు.

బిలాస్‌పూర్, హమీర్‌పూర్, కిన్నౌర్, కుల్లు, సిర్మౌర్, సిమ్లా, సోలాన్, మండీ జిల్లాల్లో ప్రకృతి విలయతాండవం సృష్టించింది. హిమాచల్‌ప్రదేశ్ వ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండ్లు కూలిపోగా, 14 వంతెనలు ధ్వంసమయ్యాయి. అనేక జిల్లాల్లో జనజీవనం స్తంభించిపోయింది. 300కి పైగా పశుసంపద మృత్యువాత పడింది.

చంద్రబాబుపై విమర్శలు తగవు

- మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

సింగయ్య కుటుంబానికి మద్దతుగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శలు తగవని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. సింగయ్య కులం వైసిపి నేతలకు ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. గతంలో వైసిపి ఎమ్మెల్సీ దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేస్తే నోళ్లేమయ్యాయని ప్రశ్నించారు. వైసిపి పాలనలో వైద్యులు సుధాకర్, అచ్చెన్న, చీరాలలో కిరణ్ మారణకాండలు జరిగిన సమయంలో వైసిపి నేతలు సాకే శైలజానాథ్, మేరుగ నాగార్జున ఎక్కడున్నారని ప్రశ్నించారు.

సిఎం చంద్రబాబు వ్యాఖ్యలను వైసిపి నేతలు వక్రీకరించి నీచపు రాజకీయం చేస్తున్నారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మరో ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల జీవితాలతో ఆడుకునేందుకు జగన్ సిద్ధమయ్యారని మరో ప్రకటనలో లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు విమర్శించారు.

టిడిపి కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు టిడిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి స్ఫూర్తితో యువత ముందుకు నడవాలన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. దేశ ప్రజలకు స్వేచ్ఛావాయువులను అందించేందుకు అల్లూరి పోరాడి అమరుడయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం టిడిపి కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల నుంచి పల్లా శ్రీనివాసరావు వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టిబెట్ విషయంలో జోక్యం వద్దు !

- భారత్‌కు చైనా సూచన

బీజింగ్ : టిబెట్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని భారత్‌కు చైనా సూచించింది. టిబెట్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడాన్ని నిలిపివేయాలని, అలాగే చైనాతో అభివృద్ధి సంబంధాలు దెబ్బతినకుండా చూడాలని ఆశిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ ఒక ప్రకటన జారీ చేశారు. తన మాటలు, చేతల విషయంలో భారత్ అప్రమత్తతతో వ్యవహరించాలని ఆశిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది. చైనా అంతర్గత వ్యవహారాల్లో, అలాగే జియాంగ్ (టిబెట్) సంబంధిత అంశాల్లో జోక్యం చేసుకోవద్దని కోరింది. తద్వారా చైనా–భారత్ సంబంధాల మెరుగుదలపై, అభివృద్ధిపై ఎలాంటి ప్రభావం పడకుండా చూసుకోవాలని సూచించింది. దలైలామా వారసుడి ఎంపిక విషయంలో చైనాకు ఉన్న హక్కులకు విరుద్ధంగా కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో చైనా మంత్రి స్పందిస్తూ పై విధంగా స్పందించారు. దలైలామా వారసుడి ఎంపిక అనేది పూర్తిగా ఆయన ఇష్టమేనని, ఇందులో ఎవరి జోక్యం ఉండరాదని రిజిజు ఇటీవల వ్యాఖ్యానించారు. అయితే దలైలామా వారసుడి ఎంపికను చైనా ఆమోదించాల్సివుంటోంది. ఇది తరతరాలుగా సాంప్రదాయంగా ఉంటోంది.

పుతిన్ వైఖరితో నిరాశ చెందా !

- ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వైఖరి పట్ల తాను చాలా నిరాశ చెందానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుక్రవారం విలేకర్లతో వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని పుతిన్ ఆపుతారని తాను అనుకోవడం లేదని కూడా ఆయన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో మాట్లాడనున్నట్లు తెలిపారు. పుతిన్‌తో ఫోన్లో మాట్లాడినా ఎలాంటి పురోగతి లేదని, ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపేందుకు ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదని అన్నారు. ఉక్రెయిన్‌కు పంపాల్సిన కొన్ని ఆయుధాల షిప్‌మెంట్లను అమెరికా నిలుపుచేసింది. పైగా మూడేళ్ళకు పైగా సాగుతున్న యుద్ధానికి స్వస్తి చెప్పేందుకై జరగాల్సిన అమెరికా నేతృత్వంలోని శాంతి చర్చలు కూడా నిలిచిపోయాయి. దాంతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పుతిన్‌తో చాలాసేపు మాట్లాడాను. ఇరాన్‌తో సహా అనేక అంశాలపై మాట్లాడుకున్నాం. అలాగే ఉక్రెయిన్‌తో యుద్ధంపై కూడా చర్చించాం.' కానీ ప్రస్తుత పరిస్థితుల పట్ల తాను సంతృప్తిగా లేనని ట్రంప్ విలేకర్లతో చెప్పారు. ఈ ఏడాది జనవరిలో అధికారం చేపట్టిన తర్వాత ట్రంప్ ఐదుసార్లు పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతీసారి ఒప్పందం దిశగా పురోగతి వుంటుందనే ఆశావాదంతో కూడిన వార్తలు వెలువడేవి కానీ ఈసారి ట్రంప్ అత్యంత అసాధారణ రీతిలో నిరాశజనకమైన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇరాన్–ఇజ్రాయిల్ ఘర్షణల్లో అవసరమైతే మధ్యవర్తిత్వం చేస్తానని పుతిన్ ముందుకు వచ్చినపుడు ట్రంప్ జోక్యం చేసుకుని, ముందుగా ఉక్రెయిన్ యుద్ధంపై దృష్టి కేంద్రీకరించాలని ఆయనకు సూచించినట్లు కూడా వార్తలు వచ్చాయి.

మాజీ మంత్రి ఏరాసు ఇంటిపై టిడిపి కార్యకర్తలు దాడి

- ఇంటి కిటికీలు ధ్వంసం
- ఏరాసుకు గాయాలు

ప్రజాశక్తి–ఆత్మకూరు

నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఉమ్మడి రాష్ట్ర న్యాయశాఖ మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఇంటిపై శుక్రవారం టిడిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. దీంతో ఆయనకి గాయాలయ్యాయి. ఈ సంఘటనతో కొన్ని గంటలపాటు ఆత్మకూరు పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టిడిపి కార్యకర్తలు ఏరాసు ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ప్రతాప్ రెడ్డికి ఆయన అనుచరుడు రాఘవరెడ్డికి గాయాలయ్యాయి. ఆత్మకూరు డిఎస్‌పి రామాంజినాయక్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రతాప్ రెడ్డిని వేరే మార్గంలో చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. మరోవైపు సదరన్ క్యాంపు వద్ద పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు ఉన్నారని తెలుసుకొని నంద్యాల రస్తా నుండి బైపాస్ రోడ్డు మీదుగా నందికొట్కూరుకు ఎంపి వెళ్లారు.



ఆత్మకూరులో ఏరాసు ఇంటి ముందు గుమిగూడిన టిడిపి కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) ధ్వంసమైన ఇంటి కిటికీలు

వైద్య విద్యార్థులకు విద్యార్థి నేతల మద్దతు



విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసి వైద్యులుగా తిరిగి వచ్చిన తమకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష చేపట్టిన మెడికల్ గ్రాడ్యుయేట్లకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నేతలు

కుంభకోణాల ఊబిలో వైద్య విద్య

- కేంద్ర దర్యాప్తు సంస్థ కూపీతో వెలుగులోకి ..ఎఫ్ఐఆర్ నమోదు
- యుజిసి మాజీ చైర్మన్ సహా ఉన్నతాధికారులపై కేసు
- బూటకపు డిగ్రీలు..నకిలీ ఫ్యాకల్టీలు ..సర్వత్రా అక్రమాలే



ముంబయి : దేశంలో వైద్య విద్యారంగం కుంభకోణాల ఊబిలో చిక్కుకుపోయింది. విశ్వవిద్యాలయాల గ్రాంటు కమిషన్ (యుజిసి), జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసి) మాజీ చైర్మన్ల మొదలు వివిధ ప్రాంతాల్లోని వైద్య విద్యా కళశాలల్లో సిబ్బంది వరకు సర్వత్రా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) దర్యాప్తులో వెలుగుచూడటం ఆందోళన రేకెత్తిస్తోంది. విద్యా రంగ ప్రయివేటీకరణను విచ్చలవిడిగా అమల్జేసిన ఫలితంగా నకిలీ సిబ్బంది, బూటకపు డిగ్రీలు వైద్య విద్యా రంగం సర్వం అక్రమాలే దర్శనమిస్తున్నాయి. దేశ వైద్య విద్య రంగంలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని, అనేక అక్రమాలు తమ దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయని సిబిఐ పేర్కొంది. ఈ కుంభకోణంతో సంబంధమున్న పలువురు సీనియర్ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అనధికారికంగా రహస్య సమాచారాన్ని పంచుకోవడం, చట్టబద్ధమైన తనిఖీ ప్రక్రియలను తారుమారు చేయడం, తమకిష్టమైన ప్రైవేటు సంస్థలకు అనకూలంగా పనులు జరిగేలా చూసేందుకు విచ్చలవిడిగా ముడుపులు అందచేయడం వంటివి ఈ కుంభకోణంలో చోటు చేసుకున్నాయని సిబిఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ అవినీతి కుంభకోణం చాలా లోతైన నేరపూరితమైన కుట్రతో కూడినదని తెలిపారు. ఇందులో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎఫ్‌డబ్ల్యు) సీనియర్ అధికారులు, జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి), దేశవ్యాప్తంగా పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల ప్రతినిధులు, యుజిసి మాజీ చైర్మన్‌లకు సంబంధముందని చెప్పారు.

అవినీతి నిరోధక చట్టంలోని 7,8,9,10,12 సెక్షన్ల కింద, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 61(2) కింద సిబిఐ కేసు నమోదు చేసింది. దేశవ్యాప్తంగా డజన్ల సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు వ్యక్తులు, పారిశ్రామికాధిపతులు ఈ దర్యాప్తులో చిక్కుకున్నారు. ముడుపుల నుండి క్రిమినల్ కుట్ర వరకు అధికార రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించడం, ఫోర్జరీ సంతకాలు ఇలా పలు అభియోగాలు వారిపై నమోదయ్యాయి.

చట్టవిరుద్ధంగా అందుబాటులోకి మెడికల్ కాలేజీల తనిఖీల వివరాలు

న్యూఢిల్లీలో కొంతమంది ప్రభుత్వ అధికారుల బృందం మెడికల్ కాలేజీలకు సంబంధించిన తనిఖీలు, గుర్తింపు, పునరుద్ధరణ ప్రక్రియలకు సంబంధించిన విశ్వసనీయమైన, రహస్యమైన ఫైళ్లను చట్టవిరుద్ధంగా అందుబాటులోకి తీసుకురావడానికి వెసులుబాటు కల్పించిందని సిబిఐ వెల్లడించింది. ఈ బృందంలో ఎన్ఎంసి, ఆరోగ్య మంత్రిత్వ శాఖలకు చెందిన వారు వున్నారు. ఎఫ్ఐఆర్ నమోదైన వారిలో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిఐఎస్ఎస్) ఛాన్సలర్ డి.పి.సింగ్ వున్నారు. ఈయన గతంలో యుజిసి చైర్మన్‌గా కూడా పనిచేశారు. కాలేజీల ఇనస్పెక్షన్ షెడ్యూళ్ళ వివరాలు, తనిఖీలకు వచ్చే వారి సమాచారం అంతా రహస్యంగా వుంచాలి. కానీ ఈ బృందం ముందుగానే కాలేజీ ప్రతినిధులకు వెల్లడించేవారు. దీంతో ఆయా వైద్య సంస్థలు అధికారిక ఇనస్పెక్షన్ల సందర్భంగా మోసపూరిత చర్యలకు పాల్పడేందుకు వీలు వుండేది. అంటే కాలేజీల్లో ఘోస్ట్ ఫ్యాకల్టీని మోహరించడం, బూటకపు రోగులను అడ్మిట్ చేసుకోవడం, బయోమెట్రిక్ అటెండెన్స్ వ్యవస్థలో అవకతవకలకు పాల్పడడం, తమ సంస్థలకు అనుకూంగా నివేదికలు ఇచ్చేలా తనిఖీలు చేసే బృందాలకు ముడుపులు ఇవ్వడం వంటివి జరిగేవని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ప్రైవేటు కాలేజీల్లో పనిచేసే మధ్యవర్తులకు వారి వ్యక్తిగత మొబైల్స్‌కు పలు మంత్రిత్వ శాఖల మధ్య అంతర్గతంగా నడిచే ఫైళ్ళను ఫోటోలు తీసి పంపేవారు. రహస్య సమాచారంతో పాటు సీనియర్ అధికారుల వ్యాఖ్యలు కూడా చేరవేసేవారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన అధికారులే ఇందుకు పాల్పడేవారు.

హవాలా మార్గాల ద్వారా ముడుపులు

ఇలా లీకైన డేటాను అందుకున్న వారిలో గుర్‌గావ్‌కు చెందిన వీరేంద్ర కుమార్, న్యూఢిల్లీకి చెందిన మనీషా జోషి, ఇంకా ఇండోర్‌లోని ఇండెక్స్ మెడికల్ కాలేజీ చైర్మన్ సురేష్ సింగ్ బడోరియా, ఉదయ్‌పూర్‌లోని గీతాంజలి యూనివర్శిటీ రిజిస్ట్రార్ మయూర్ రావల్ ఇలా పలువురు వున్నారని ఎఫ్ఐఆర్ పేర్కొంది. ఆ సమయంలో మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ (ఎంఎఆర్‌బి)కి పూర్తి స్థాయి సభ్యుడిగా వున్న జితూ లాల్ మీనాతో వీరేంద్ర కుమార్‌కు సంబంధాలుండేవని దర్యాప్తులో వెల్లడైంది. పైగా హవాలా మార్గాల ద్వారా ముడుపులను వసూలు చేయడంలో మధ్యవర్తిగా కూడా వుండేవారు. వివిధ కాలేజీ అడ్మినిస్ట్రేటర్ల నుండి కుమార్‌కు నిధులు బదిలీ అయ్యేవి. ఆతర్వాత వాటిని మీనాకు అందచేసేవారు. ఇలా అక్రమంగా అందిన నిధుల్లో కొంత మొత్తాన్ని తీసి రాజస్థాన్‌లో హనుమాన్ ఆలయం నిర్మించడానికి కూడా మీనా వాడారని అధికారులు తెలిపారు. ఆ ఆలయ ఖర్చే రూ.75లక్షలు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోనూ అక్రమార్కులు

వీరేంద్ర కుమార్ కార్యకలాపాలు దక్షిణ భాతదేశానికీ విస్తరించాయని ఎఫ్ఐఆర్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని కదిరికి చెందిన తన అసోసియేట్ బి.హరిప్రసాద్, ఆయన భాగస్వాములు అంకం రాంబాబు (హైదరాబాద్), కృష్ణ కిషోర్ (విశాఖపట్నం)లతో కలిసి డమ్మీ ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడం, ముడుపులు తీసుకుని రెగ్యులేటరీ అప్రూవల్స్ జారీ చేయడం వంటి పనులు వీరేంద్ర కుమార్ చేసిపెట్టేవారు. గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ నుండి రూ.50లక్షలను కృష్ణకుమార్ వసూలు చేసి కుమార్‌కు పంపాడు. వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇనిస్టిట్యూట్‌ఆఫ్ మెడికల్‌సైన్సెస్ వంటి సంస్థలూ ఈ నెట్‌వర్క్‌లో భాగమే. ఈ సంస్థ నుండి రూ.4కోట్లకు పైగా మొత్తాలు హరిప్రసాద్‌కు చెల్లించి, ఎన్ఎంసి నుండి తమకు అనుకూలంగా నివేదిక వచ్చేలా చూసుకున్నారు. మధ్యవర్తుల ద్వారా ఈ ముడుపుల చెల్లింపులు జరిగేవి.

క్లోనింగ్ చేసిన వేలిముద్రలతో బయోమెట్రిక్

ఇండోర్‌లోని ఇండెక్స్ మెడికల్ కాలేజీలో ఎన్ఎంసి కనీసప్రమాణాలను అందుకోవడం కోసం ఘోస్ట్ ఫ్యాకల్టీని శాశ్వత ఉద్యోగిగా చూపించారు. పూర్తి స్థాయి ఫ్యాకల్టీ హాజరవుతోందని చెప్పడానికి గానూ క్లోనింగ్ చేసిన వేలి ముద్రలను ఉపయోగించి బయో మెట్రిక్ వ్యవస్థను కూడా తారుమారు చేశారు. అలాగే కాలేజీ చైర్మన్ సురేష్ సింగ్ బడోరియా మాల్వాంచల్ యూనివర్శిటీ (ఇండెక్స్ మెడికల్ కాలేజీ మాతృ సంస్థ) ద్వారా బూటకపు డిగ్రీ సర్టిఫికెట్లు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు జారీ చేశారు. రాయ్‌పూర్‌లోని శ్రీ రావత్‌పురా సర్కార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్‌రీసెర్చ్ (ఎస్ఆర్ఐఎంఎస్ఆర్)లో ఇటీవలే అంటే జూన్ 30న ఇనస్పెక్షన్ జరిగింది. దానికి వచ్చే నలుగురు సభ్యుల ఎన్ఎంసి బృంద వివరాలను తెలుసుకోవడానికి రూ.25 నుండి రూ.30లక్షల వరకు ముడుపులు అందచేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- సిఐటియు, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక, వ్యయసాయ కార్మిక మహిళా, విద్యార్థి సంఘాలు ఉమ్మడి ప్రచారాన్ని నిర్వహించాయి. ప్రజలపై మోడీ ప్రభుత్వం విధిస్తున్న భారాలకు, దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ సమ్మె ప్రజా పోరాటమని ఆయా సంఘాల నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం నాడిక్కడ సిఐటియు కేంద్ర కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రచార ఊరేగింపు అజయ్ భవన్, రౌస్ అవెన్యూ కోర్టు, మాత సుందరి కాలేజ్, కాగ్ కార్యాలయం మీదుగా గాంధీ మార్కెట్ వరకు సాగింది.కరపత్రాలు పంపిణీ చేసి, మోడీ పాలన నేపథ్యంలో కొనసాగుతున్న కార్మిక చట్టాల మార్పులు, వ్యవసాయ విధానాలు, ప్రభుత్వ రంగాల విక్రయాలు ఎలా ప్రజలపై భారం మోపుతున్నాయో వివరించారు. ఉపాధికి నిధులు తగ్గింపు, సెక్యులర్ రాజ్యాంగ స్థానంలో మనువాదాన్ని తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి కుట్రపూరిత విధానాలను నేతలు వివరించారు.

గాంధీ మార్కెట్‌లో జరిగిన సభకు సిఐటియు నాయకుడు పలివాల్ అధ్యక్షత వహించారు. సిఐటియు అఖిల భారత నాయకులు ఉమేష్, సాయిబాబు, ఐద్వా నాయకురాలు పుణ్యవతి, ఎఐఎడబ్ల్యుయు నేతలు బి. వెంకట్, సాహిల్, ఎస్ఎఫ్ఐ నేత షోహన్, సిఐటియు నేత శర్మ , ఐద్వా నేత రేణు ప్రసంగించారు. కార్మిక చట్టాలలో మార్పులు కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయని,మహిళలపై అణిచివేత పెరుగుతోందని, విద్యాసంస్థల స్వతంత్రత తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

బిజెపితో ఎప్పటికీ పొత్తు ఉండదు

- టివికె నేత విజయ్ స్పష్టీకరణ
- డిఎంకెతోనూ దూరమేనని ప్రకటన

చెన్నై : మతతత్వ బిజెపితో తాము ఎప్పటికీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగం (టివికె) అధినేత విజయ్ స్పష్టం చేశారు. అలాగే తమిళనాడులో అధికార పార్టీ అయిన డిఎంకెతోనూ తాము దూరంగా ఉంటామని ఆయన ప్రకటించారు. 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మూడో కూటమి అవసరమైతే దానికి తమ పార్టీ నేతృత్వం వహిస్తుందని చెప్పారు. శుక్రవారం చెన్నై శివార్లలోని టివికె ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2026 ఎన్నికలకు పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్‌ను ప్రకటించారు. పొత్తు, ఇతర విషయాలపై నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని విజయ్‌కు అప్పగించారు. అలాగే సెప్టెంబర్ నుంచి రాష్ట్రంలో విజయ్ పర్యటించనున్నారు. పార్టీ రెండో రాష్ట్ర సమావేశాన్ని ఆగస్టులో నిర్వహించడాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో విజయ్ మాట్లాడుతూ కేంద్రంలోని అధికార బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మతపరమైన భావాలను ఉపయోగించుకుంటోందని, సమాజంలో విభజనలు సృష్టించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. 'ఇటువంటి విషపూరిత వ్యూహాలు మరెక్కడైనా పనిచేసినా... తమిళనాడులో మాత్రం ఎప్పటికీ విజయం సాధించవు' అని విజయ్ తెలిపారు. 'సామాజిక న్యాయం, మత సామరస్యం, సోదరభావం సమానత్వం తమిళనాడు గడ్డపై లోతుగా పాతుకుపోయాయి. పెరియార్ (ఇవి రామసామి), అరిజ్ఞార్ అన్నా (సిఎన్ అన్నాదురై).. లేదా తమిళనాడు ప్రజలు గౌరవించే ఇతర నాయకులను అవమానించే ఏ రాజకీయ పార్టీ కూడా ఇక్కడ విజయం సాధించదు. ఇటువంటి నాయకులను అగౌరవపర్చాలనుకుంటే ఇక్కడ బిజెపి ఆటలు సాగవు' అని విజయ్ అన్నారు. కాగా, శుక్రవారం సమావేశంలో మెల్మాలో సిప్‌కాట్ ప్రాజెక్టు విస్తరణను, బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణను వ్యతిరేకించడం, చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలని, ధరలు క్షీణించడంతో ప్రభావితమైన మామిడి రైతులకు పరిహారం చెల్లించాలని, ఇసుక, ఖనిజాల అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలనే వంటి డిమాండ్లతో 20 తీర్మానాలను కార్యనిర్వాహక కమిటీ ఆమోదించింది. అలాగే, రెండు భాషల విధానానికి తమ మద్దతును పార్టీ పునరుద్ఘాటించింది. తమిళ నాగరికతకు సంబంధించిన ఆధారాలను కేంద్రం తారుమారు చేస్తోందని విమర్శించింది. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదన, డిలిమిటేషన్ ప్రక్రియలను టివికె ఖండించింది.

నీట్ యుజి ఫలితాలపై పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : నీట్ యుజి 2025 ఫలితాలను సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. జాతీయ స్థాయి పరీక్షల్లో కోర్టు జోక్యం చేసుకోదని, వేలాది మంది విద్యార్థుల జీవితాలను, కెరీర్‌ను ప్రమాదంలో పడేసి చర్యలు తాము తీసుకోజాలమని సుప్రీంకోర్టు పేర్కొంది. నీట్ పిజి తుది 'కీ' లో మూడు తప్పులు ఉన్నాయని, వీటిని ఎన్‌సిఇఆర్‌టి ప్రమాణాలకు అనుగుణంగా సరిద్ది, ఫలితాలను కొత్తగా ప్రకటించాలని కోరుతూ ఈ పిటిషన్ దాఖలయింది. కొన్ని రోజుల క్రితం కూడా ఫలితాలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.



మణిపూర్‌లో పలు ప్రాంతాల్లో భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలకు ఆజ్యం

- కుకీలతో శాంతి చర్చలకు తెర
- సంఘ్ పరివార్ అనుకూల మెయితీ సంస్థల ఒత్తిడి

ఇంఫాల్ : మణిపూర్‌లో ఉద్రిక్తతలు రాజేసేందుకు సంఘ్ పరివార్ అనుకూల మెయితీ తెగలకు చెందిన పలు సంస్థలు మళ్లీ ఆజ్యం పోస్తున్నాయి. కొండ ప్రాంతాల్లోని గిరిజన తెగ అయిన కుకీ గ్రూపులతో శాంతి చర్చలు నిలిపివేయాలని మెయితీ, దాని అనుబంధ సంస్థలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఇండిజీనస్ పీపుల్స్ ఫోరం మణిపూర్ (ఐపిఎఫ్ఎం), మెయితీ అలయన్స్ (ఎంఎ), ఫుట్‌హిల్ నాగా కోఆర్డినేషన్ కమిటీ (ఎఫ్ఎన్‌సిసి), థడౌ ఇన్పి మణిపూర్ (టిఐఎం) అనే నాలుగు సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఈ నెల 3న ఒక వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికల సమయంలో బిజెపికి కొమ్ముకాసిన ఈ సంస్థలన్నీ అక్కడ అనిశ్చితికి కారణం కుకీలే అన్నట్టుగా నెపాన్ని ఆపాదించాయి. 2023 మే నుంచి మణిపూర్‌లో హింసాకాండ ప్రారంభమైన సంగతి తెలిసిందే. గిరిజన కుకీ గ్రామాలు, ప్రజలు లక్ష్యంగా చేసుకుని అధిపత్య మెయితీ గ్రూపులు పదేపదే దాడులు, హత్యలకు పాల్పడుతున్న సంగతి విదితమే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెయితీ గ్రూపును ఎగదోస్తుండగా..కుకీలను నిరాయుధులుగా మార్చి వేధింపులకు గురి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం సైతం మణిపూర్‌లోని పలు ప్రాంతాల్లో 200 ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో 21 ఐఎన్ఎస్ఎస్ రైఫిళ్లు, 11 ఎకె సీరిస్, 26 ఎస్ఎల్ఆర్, రెండు సిన్నప్పర్లు తదితర ఆయుధాలున్నాయి. ఈ నేపథ్యంలో మణిపూర్‌లో ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది.

ఇడి తీరు వింతగా ఉంది

- నేషనల్ హెరాల్డ్ కేసుపై కోర్టులో సోనియా గాంధీ వాదనలు




న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థలు వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ శుక్రవారం నాడు విస్మయం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వ్యవహార శైలి వింతగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. నేషనల్ హెరాల్డ్ వార్తా సంస్థకు సంబంధించి సోనియా తదితరులపై ఇడి నమోదు చేసిన కేసులో ఆమె తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టులో శుక్రవారం వాదనలు వినిపించారు. 'ఇడి నమోదు చేసిన కేసు చాలా విచిత్రమైనదిగా ఉంది. ఇందులో ఎలాంటి ఆస్తి లేదు. లేకపోయినా..ఆ ఆస్తిని అనుభవిస్తున్నట్లు ఊహించి కట్టుకథలు అల్లారు' అని సింఘ్వి పేర్కొన్నారు. ఏళ్లుగా సాగదీస్తున్న ఈ కేసులో ఇడి ఇప్పటి వరకు చేసిందేమీ లేదన్నారు. నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను ప్రచురించే అసోసియేటడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) యొక్క ఆస్తులు యంగ్ ఇండియా ద్వారా అక్రమించడానికి సోనియా గాంధీ ప్రయత్నించారనే ఇడి ఆరోపణలను సంఘ్వి ఖండించారు. ఎజెఎల్‌ను రుణ రహితంగా మార్చడానికి ఈ కసరత్తు చేపట్టినట్లు వివరించారు. ప్రతి కంపెనీకి చట్టం ప్రకారం ఉండే హక్కుల ప్రకారమే ఈ విధంగా చేసినట్లు చెప్పారు. యంగ్ ఇండియన్ ఒక లాభాపేక్షలేని సంస్థ అని ఆయన అన్నారు. ఈ కేసు విచారణలో గురువారం ఇడి తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు వాదనలు వినిపించారు.

ప్రధాని మోడీకి ట్రినిడాడ్, టొబాగో అత్యున్నత పురస్కారం



పోర్ట్ ఆఫ్ స్పెయిన్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ట్రినిడాడ్ టొబాగో దేశపు అత్యున్నత పౌర పురస్కారం లభించింది. మోడీ ప్రపంచ నాయకత్వం, ప్రవాస భారతీయులతో మోడీకి ఉన్న లోతైన అనుబంధం, కోవిడ్-19 మహమ్మారి సమయంలో మోడీ చేసిన మానవతా ప్రయత్నాలకు గుర్తింపుగా 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో" అవార్డును ప్రకటిస్తున్నట్లు ఆ దేశ ప్రధాని కమ్లా పెర్సాద్-బిస్సెస్సార్ గురువారం ప్రకటించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా రెండు రోజుల పాటు ఈ దేశంలో మోడీ పర్యటిస్తున్నారు. ప్రధానమంత్రి హోదాలో మోడీ ఈ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి. అలాగే 1999 తరువాత ట్రినిడాడ్, టొబాగోలో ఒక భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

మధుర షాహి ఇద్గాను 'వివాదాస్పద నిర్మాణం'గా ప్రకటించలేం



- అలా పేర్కొనడం సముచితం కాదు
- పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

న్యూఢిల్లీ : మధురలోని సాహి ఇద్గా మసీదును ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది. షాహి ఇద్గా మసీదుపై దాఖలైన అన్ని పిటిషన్లపై భవిష్యత్‌లో జరిపే విచారణల ప్రోసీడింగ్స్‌లో 'షాహి ఇద్గా మసీదు'కు బదులుగా 'వివాదస్పద నిర్మాణం' అని పదాన్ని ఉపయోగించాలని కోర్టు స్టెనోగ్రాఫర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది మహేంద్ర ప్రతాప్ సింగ్ అనే న్యాయవాది ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని జస్టిస్ రామ్ మనోనర్ నారాయన్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. సాధారణంగా ఈ నిర్మాణాన్ని షాహి ఇద్గా మసీదు అని పిలుస్తారని, ప్రస్తుతం కొనసాగుతున్న పిటిషన్లతో పాటు ఇంకా ప్రారంభం కాని పిటిషన్ల విచారణలో కూడా ఈ మసీదును 'వివాదాస్పద నిర్మాణం'గా పేర్కొనాలని స్టెనోగ్రాఫర్‌కు ఆదేశాలు జారీ చేయడం మంచిది కాదని, సముచితం కాదని జస్టిస్ మిశ్రా స్పష్టం చేశారు. కాగా, ఈ మసీదుకు వ్యతిరేకంగా దాఖలైన మొత్తం 18 వ్యాజ్యాలను అలహాబాద్ హైకోర్టు ప్రస్తుతం విచారిస్తోంది. అయితే మసీదును తనిఖీ చేయడానికి కమిషనర్‌ను నియమిస్తూ 2023లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన అనుమతిని 2024 జనవరిలో సుప్రీంకోర్టు రద్దు చేసింది.

గాజాలో తీవ్రమైన మానవతా సంక్షోభం

- ఆందోళన వ్యక్తం చేసిన ఐరాస సెక్రటరీ జనరల్ గుటెరస్
- అంతర్జాతీయ చట్టాలను పాటించని ఇజ్రాయిల్



గాజాలో ఎటు చూసినా ఇలాంటి దృశ్యాలే

న్యూయార్క్ : గాజాలో తీవ్రమైన మానవతా సంక్షోభంపై ఐక్యరాజ్య సమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ అంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. సాదారణ ప్రజల మరణాలను ఆయన ఖండించారు.గత కొన్ని రోజుల్లో ఇజ్రాయెల్ సైన్యం బెదిరింపులకు భయపడి దాదాపు 30 వేల మంది ప్రజలు భద్రత లేకుండా తమ గూడు వదిలి పారిపోవాల్సి వచ్చిందని, ఆశ్రయం, ఆహారం, ఔషధాలు నీరు వంటి ప్రాథమిక అవసరాల్లేవని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రయం, ఆహారం కోసం వచ్చిన వారిపై జరిగిన దాడుల్లో వేలమంది పాలస్తీనియన్లు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. గత కొన్ని రోజుల నుండి గాజాకు ఇంధన సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఇంక్యుబేటర్లు మూతపడ్డాయి, గాయపడిన వారిని, రోగులను తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో లేని పరిస్థితి, నీటిని శుద్ధి చేయలేని దుస్థితి ఏర్పడింది. ఐరాస, ఇతర సహాయ సంస్థలు నిర్వహిస్తున్న స్వల్ప సహాయ కార్యక్రమాలు కూడా ఆగిపోయే ప్రమాదం ఉందని గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మానవతా చట్టాల ప్రకారం పౌరులను గౌరవించాలి, రక్షించాలి వారి అవసరాలను తీర్చాలని గుటెరస్ స్పష్టం చేశారు. ప్రజలకు సహాయం అందించేందుకు ఐరాస వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని, సురక్షితంగా పెద్ద ఎత్తున సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని , ఇజ్రాయిల్‌తో సహా అన్ని పక్షాలు అంతర్జాతీయ చట్టాలను పాటించాలని, వెంటనే శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించాలని, బందీలుగా ఉన్నవారిని షరతులు లేకుండా విడిచిపెట్టాలని మరోసారి ఆయన కోరారు.

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాలపై ప్రజాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

చిన్న వ్యాపారులకు తప్పుడు రీడింగ్‌లతో ఎక్కువ వినియోగం చూపించి పది రెట్ల వరకు బిల్లు పెంచేస్తున్నారని, దీనిపై విచారణ చేయిస్తామని హామీ ఇచ్చిన విద్యుత్ శాఖ మంత్రి ఇప్పుడు మొహం చాటేస్తున్నారని, నోరు మెదపడం లేదని తెలిపారు. తొలి అడుగు పేరుతో వచ్చే శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను విద్యుత్ భారాలపై ప్రజలు నిలదీయాలని, స్మార్ట్ మీటర్లను వీధి వీధినా, ఇంటింటా ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, నాయకులు బి.రమణారావు, బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

వివాదాస్పద అంశాన్ని కమిషన్ ముందుకు తెచ్చిందని తెలిపారు. బీహార్‌లో వలసపోయిన వారి ఓట్లు చేర్చాలంటే పుట్టినరోజు సర్టిఫికెట్ అడుతున్నారని, మన రాష్ట్రంలోనే పుట్టినరోజు సర్టిఫికెట్లు అందరికీ లేవని తెలిపారు. ఎన్నికల కమిషన్ బిజెపికి మేలు చేసేందుకు ఇటువంటి నిర్ణయం తీసుకుందని, ఇది భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా వర్తిస్తుందని, అన్ని రాజకీయ పార్టీలు దీనిని వ్యతిరేకించాలని కోరారు. పార్లమెంటు సీట్లు పెంచే విషయంలో జనాభా ప్రాతిపదికనా, సీట్ల ప్రాతిపదికనా అనే చర్చ చేస్తున్నారని, సీట్ల ప్రాతిపదికన పెంపు జరగాలని సూచించారు. మౌలికంగా ఎన్నికల సంస్కరణలు జరగాలని చెప్పారు. ప్రస్తుతం ఎక్కువ ఓట్లు వచ్చినా తక్కువ సీట్లు, తక్కువ ఓట్లు వచ్చినా ఎక్కువ సీట్లు వస్తున్నాయని, ప్రధాని మోడీ తక్కువ ఓట్లతోనే ప్రధాని అయ్యారని అన్నారు. డీలిమిటేషన్లో ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా పెంచే సీట్లను దామాషా ఓటు పద్ధతిలో రాజకీయ పార్టీలకు కేటాయించాలని కోరారు. పార్టీలకు ఓట్లు వేయడం ద్వారా ఎక్కువ ఓట్లు వచ్చిన పార్టీలు వారి అభ్యర్థులను చట్టసభలకు పంపిస్తాయని ఈ పద్ధతి రావాలని అన్నారు. ఓట్లు, సీట్లు మధ్య గ్యాప్ తగ్గించడం ద్వారా ఓటర్ల మనోభావాలు కాపాడేందుకు దామాషా పద్ధతి ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజల హక్కులను ఎన్నికల కమిషన్ కాపాడలని సూచించారు. దీనిపై సిపిఎంగా ఇప్పటికే వినతిపత్రం ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే ఇవిఎంల మీద పెద్ద చర్చ జరుగుతోందని, అవి వద్దనిగానీ, బ్యాలెట్లు నిర్వహించాలని గానీ తాము చెప్పడం లేదని అయితే వీటికి జోడించిన వివిప్యాట్లకు ఇవిఎంలకు ఉన్న డిజిటల్ భద్రత లేదని తెలిపారు. వివి ప్యాట్ల తయారీ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నారని, దీనివల్ల దాన్ని మార్పులు చేసేందుకు వీలు ఉంటుందని తెలిపారు. భద్రతరీత్యా వాటిని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకూడాదని చెప్పారు. ప్రింటయిన స్లిప్పులకు, ఓట్లకు సరిపోలాలన్నారు. కనీసం 50 శాతం వివి ప్యాట్లు లెక్కించాలని చెప్పారు.

పోలింగు రోజు మహారాష్ట్రలో జరిగిన వ్యవహారం అనుమానాస్పదంగా ఉందని, అక్కడ సమయం గడిచిన తరువాత జరిగిన పోలింగులో భారీ తేడాలు వచ్చాయని, 17సి లిస్టుకు, ఫలితాలు లెక్కించిన తరువాత ఫారం 20లో వచ్చిన ఓట్లకు భారీ వ్యత్యాసం ఉందని అన్నారు. రిగ్గింగు జరిగిందని అనుమానం ఉన్న చోట్ల వెబ్‌క్యామ్ చూపించాలని కోరితే ఎన్నికల కమిషన్ చూపించకుండా అధికార పార్టీకి తాబేదారుగా వ్యవహరిస్తోందని తెలిపారు. రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి సమావేశానికి ఎవరు రావాలో ఎన్నికల కమిషన్ నిర్ణయిస్తోందని, ఇదేమి పద్ధతని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలతో కలిసి పనిచేయాలని అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని (లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్) అన్నారు.

మా భూములు ఇవ్వంగాక ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైంది. ఇండో సోల్ ప్రాజెక్టు కోసం భూములు తీసుకుంటున్నామని, భూములు ఇచ్చిన వారికి ఉద్యోగం, ఉపాధి లభిస్తుందని, అందరూ భూ సేకరణకు సహకరించాలని ఎస్‌డిసి రాజశేఖర్ అన్నారు. దీంతో, కరేడు రైతులు 'ఒక్క సెంట్ భూమి కూడా ఇచ్చేది లేదు' అంటూ ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ సభను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. సభ జరుగుతున్నంత సేపు ఈ విధంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. పచ్చని పొలాల్లో ప్రాజెక్టులు ఎందుకు పెడుతున్నారంటూ నిలదీశారు. కేవలం పది అడుగుల్లోనే మంచి నీరు పడుతుందని, ఇక్కడ అన్ని రకాల పంటలూ పండించుకుంటూ ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నామన్నారు. మత్స్యకారులు చేపల వేట సాగిస్తున్నారని, ఎన్నో పోరాటాలు చేసి, ఎస్‌సి, ఎస్‌టి కాలనీ ఏర్పాటు చేసుకుంటే ఇప్పుడు వచ్చి మా భూములు, ఇళ్లు తీసుకుంటామంటారా? అంటూ అధికారులను ప్రజలు నిలదీశారు. మహిళా రైతులు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ శ్రీపూజితాను ప్రశ్నల వర్షంతో ముంచెత్తారు. అభివృద్ధి కోసం పరిశ్రమ పెడుతున్నామని అంటున్నారని, మా గ్రామం ఎప్పుడో అభివృద్ధి చెందిందని, మీరు చెప్తున్న అభివృద్ధి మా గ్రామానికి వద్దని, మా ప్రాణం పోయినా ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చే ప్రశ్నే లేదని తేల్చి చెప్పారు. 'ఇండోసోల్ వద్దు. మా భూములే మాకు ముద్దు' అంటూ ఒక్కసారిగా ప్రజలు, రైతులు ముక్తకంఠంతో నినదించారు. రైతులను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. భూసేకరణకు అనుకూలంగా ఒక వ్యక్తి మాట్లాడడంతో ప్రజలంతా ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచి వచ్చావు, ఎవరు నువ్వంటూ నిలదీసి దేహశుద్ధి చేశారు.

ఎన్ని పరిశ్రమలు పెట్టి ఎన్ని ఉద్యోగాలిచ్చారు?

కరేడులో ఉద్యోగం, ఉపాధి కోసం ఇండోసోల్ పరిశ్రమను పెడుతున్నామని చెబుతున్నారని, ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న భూముల్లో ఎన్ని పరిశ్రమలు పెట్టి, ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తీసుకున్న సుమారు 35 వేల ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని, కృష్ణపట్నంలోనూ ఆరు వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని, అక్కడే ఈ పరిశ్రమను పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే కరేడు భూములు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆద్యంతం ఉద్రిక్తతల నడుమ సభ సాగడంతో సబ్ కలెక్టర్ శ్రీపూజిత రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. రైతులు తమ అభిప్రాయాలు చెబితే ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు. అనంతరం రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కరేడు గ్రామంలో 16 వేల మంది ఉన్నారని, రెండు వేల మంది ప్రజాభిప్రాయ సేకరణ సభకు వచ్చారని రికార్డు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఇవ్వబోమని తామంతా ముక్తకంఠం చెప్పిన దానిని ఏక వాక్య తీర్మానంగా నమోదు చేయాలని నినాదాలు చేశారు. దీంతో, అందరి అర్జీలను ప్రభుత్వానికి నివేదిస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చి ప్రజాభిప్రాయ సేకరణ సభను ముగించారు.

జీవన సౌరభం

పనిచేసిన ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవచ్చు గాని, అసలు ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

మీ కోసం

చెప్పులు, బూట్లు కరుస్తుంటే ఆ భాగానికి పెరుగు రాసి రాత్రంతా ఉంచి తెల్లారి ఎండిన పెరుగును దులిపి ధరించాలి.



మంచి మనిషికో మాట



అచ్యుతరావు మాస్టారు ఆరవ తరగతికి వెళ్ళి ఒక్కొక్కరి పేరు పిలిచి హాజరు పట్టీలో హాజరు వేసారు. రోజులాగే హరీష్ ఆలస్యంగా బడికి వచ్చాడు. హరీష్‌ను కారణం అడిగారు మాస్టారు. కడుపునొప్పి వచ్చిందని అందుకే రాలేకపోయానని సమాధానమిచ్చాడు హరీష్. 'ఒకరోజు మీ తాతకి బాగోలేదు అంటావు. మరొక రోజు మీ మామ్మకి బాగోలేదంటావు. ఇంకోరోజు నీకు కడుపునొప్పి అంటావు. నీకు చెప్పి, చెప్పి నాకు విసుగొచ్చింది. ఇక నావల్ల కాదు. 'మంచి మనిషికోమాట మంచి గొడ్డుకో దెబ్బ' అని ఊరికినే అనలేదు' అని మందలించారు.

మధ్యాహ్నం ఆఖరి పీరియడ్లో పిల్లలందరినీ కూర్చోబెట్టుకుని నీతి కథలు చెప్తున్నారు అచ్యుత రావు మాస్టారు. ఇంతలో కార్తికేయ నిలబడి ' మాస్టారూ ఉదయం మీరు 'మంచి మనిషికోమాట మంచి గొడ్డుకో దెబ్బ' అన్నారు అంటే ఏమిటి' అని అడిగాడు.


'మంచి మనిషికోమాట మంచి గొడ్డుకో దెబ్బ' అనేది ఒక సామెత. ఎన్నిసార్లు చెప్పినా నడవడిక మార్చుకోని వారి విషయంలోను పెద్దల మాట పెడచెవిన పెట్టిన సందర్భంలోను ఈ సామెత వాడుతున్నారు. అదిగో అటు చూడండి' అంటూ స్కూలు పక్కనే ఉన్న రామయ్య కళ్ళం వైపు చూపించారు.

అక్కడ రైతు రామయ్య బండి దిగి ఎడ్లకు కట్టిన తాళ్లను విప్పాడు. ఎద్దులు కళ్ళం లోకి వెళ్ళాయి. 'పిల్లలూ! రెండురోజుల క్రితమే రామయ్య ఆ ఎడ్లను కొన్నాడు. తొలిరోజు దారి తప్పినప్పుడు ఒక్క దెబ్బకొట్టాడు. మరుసటి రోజునుంచి చుట్టుపక్కల ఎన్ని కళ్ళాలు ఉన్నా దారి తప్పకుండా రామయ్య కళ్ళంలోకే అవి వెళ్తున్నాయి చూశారా! మళ్ళీ మళ్ళీ దెబ్బలు తినలేదు. మంచి గొడ్డుకో దెబ్బ అంటే అదే. అలాగే మంచి మనిషి కూడా ఒక్కసారి చెప్పగానే విని దానిని పాటిస్తాడు అని ఈ సామెతకు అర్థం' అని వివరించారు మాస్టారు. మాస్టారు మాటల్లోని అర్థం తెలుసుకున్న హరీష్ 'మాస్టారు ఇకనుంచి మీరు చెప్పినట్లే వింటాను. ప్రతిరోజూ బడికి వస్తాను' అన్నాడు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

టైం చెప్పండి

పిల్లలూ, కింద ఇచ్చిన గడియారాల్లో టైం ఎంత అయ్యిందో లెక్కేసి బాక్సుల్లో రాయండి.



నేను గీసిన బొమ్మ





షేక్ ఇమామ్,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్
నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆషాడ గోరింట.. అందం.. ఆరోగ్యం..



ఆషాఢమాసంలో గోరింటాకుకి ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. పిల్లలు, మహిళలు ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడానికి చాలా ఆసక్తి చూపిస్తారు. సాంప్రదాయంగా వస్తున్న ఈ ఆనవాయితీ వెనుక ఆరోగ్య పరమైన కారణాలు కూడా ఉన్నాయి.

♦ గోరింటాకులో శరీర వేడిని తగ్గించే గుణం ఉండడంతో పాటు, రోగనిరోధక శక్తిని పెంచడం, రక్తప్రసరణను మెరుగుపరచడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.

♦ ఆషాఢంలో వాతావరణ మార్పుల వల్ల శరీరంలో వేడి పెరిగే అవకాశం ఉంటుంది. వేడిని నియంత్రించడంలో గోరింటాకు సహాయ పడుతుందని పెద్దలు చెబుతారు.

♦ ఆషాఢం వర్షాకాలం ప్రారంభమయ్యే సమయం. తేమతో కూడిన వాతావరణం వల్ల చర్మ వ్యాధులు, గోళ్ల సమస్యలు, సూక్ష్మజీవుల వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువ. గోరింటాకులోని యాంటీసెప్టిక్, యాంటీబయోటిక్ గుణాలు చర్మాన్ని రక్షిస్తాయి, ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి.

♦ గ్రీష్మ రుతువు తర్వాత వర్షాకాలంలో శరీరంలో నిలిచిన వేడిని గోరింటాకు తగ్గిస్తుంది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు.

♦ ఒక పక్క వర్షాలు, మరో పక్క ఇంటి పనుల్లో నీటితో ఎక్కువ సంబంధం ఉండటం వల్ల మహిళల గోళ్లు పెళుసుబడటం, గోరు చుట్టు సమస్యలు రావచ్చు. గోరింటాకు గోళ్లను రక్షించి, ఆరోగ్యంగా ఉంచుతుంది.

♦ గోరింటాకు రక్తప్రసరణను మెరుగుపరచడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుందని నిపుణులు చెబుతారు.

♦ గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఒత్తిడి తగ్గి, మానసిక ప్రశాంతత కూడా కలుగుతుందని పెద్దలు చెబుతారు.

♦ గోరింట చెట్టు ఆకులు, పూలు, బెరడు, విత్తనాలు ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. గోరింట పొడిని మందుగా లేదా నూనెగా ఉపయోగించడం సాంప్రదాయ వైద్యంలో సాధారణం.

మందారంలా పండాలంటే..

ఆరోగ్యపరంగా ఇన్ని ప్రయోజనాలున్న గోరింటాకుని మెత్తగా రుబ్బుకుని కాళ్ల, చేతులకు పెట్టుకోవడం ఒక ఎత్తయితే.. అది ఎర్రగా పండడం మరో ఎత్తు. మంచి రంగులో గోరింట పండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

♦ గోరింటాకు పెట్టుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలి. పెట్టుకున్న తర్వాత ఎక్కువ సేపు ఉంచుకోవాలి. సహజంగా ఆరబెట్టుకోవాలి. అలా కాక, డ్రైయర్లు, ఫ్యాను గాలికి ఆరబెట్టుకుంటే రంగు రాదు.

♦ తీసేసేముందు చేతులకు కొబ్బరి నూనె రాసుకోవాలి. నీటితో మాత్రమే తొలగించుకోవాలి.

♦ గోరింటాకు మంచి రంగు రావాలంటే నిమ్మరసం, పంచదార బాగా ఉపయోగపడతాయి. నీటిలో పంచదార వేసి.. కొంచెం సేపు ఆ నీటిని వేడి చేయాలి. అది చల్లారిన తర్వాత కొన్ని చుక్కల నిమ్మరసం కలపాలి. ఈ నీటిని గోరింటాకు చేతులపై చిలకరించాలి. ఇలాచేస్తే గోరింటాకు మంచి రంగు వస్తుంది.

♦ మెహందీ పెట్టుకున్న చేతులకు లవంగాల పొగను పట్టాలి. పాన్ మీద కొన్ని లవంగాలను వేడి చేసి వాటి నుండి వచ్చే పొగతో చేతులను ఆవిరి పట్టాలి.

♦ మెహందీ పెట్టుకున్న చేతులకు ఆవనూనె లేదా వాజ్‌లైన్‌ను రాసుకోవడం వల్ల కూడా గోరింటాకు రంగు ఎక్కువ కాలం ఉంటుంది.

కోన్ వద్దు.. గోరింట ఆకే మేలు..

సహజ సిద్ధమైన గోరింటాకు దొరకక చాలామంది కృత్రిమ పద్ధతులలో కోన్లను ఉపయోగిస్తున్నారు. కోన్లను ఉపయోగించేవారు తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి నాణ్యమైన కోన్ ను ఎంచుకోవాలి.

లాసోన్ అనే సహజమైన రసాయనం వల్లే!

చాలామంది ఎక్కడపడితే అక్కడ దొరికే కోన్ల మీద ఆధారపడుతూ ఉంటారు. అయితే సహజసిద్ధంగా లభించే గోరింటాకుని పెట్టుకోవడం వల్ల అందులో ఉండే లాసోన్ అనే సహజమైన రసాయనం మన శరీరాన్ని తాకుతుంది. దీనివల్లే ఎరుపు రంగు వస్తుంది. చాలా రకాల కోన్లలో, ఎరుపు రంగు రావడం కోసం రసాయనాలు కలుపుతుంటారు. వీటివల్ల ఆరోగ్యం మాట అటుంచితే అలెర్జీలు ఏర్పడే ప్రమాదం ఉంది. కాబట్టి ఆషాఢంలో కోన్లకి బదులు గోరింటాకుని వాడుకునేందుకే ప్రాధాన్యత ఇవ్వాలి.

వర్షాకాలం.. ఏం తినాలి! ఏం తినకూడదు..



వర్షాకాలం, వివిధ అనారోగ్యాల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో జీర్ణవ్యవస్థ బలహీనపడుతుంది. ముఖ్యంగా, ఉదర సమస్యలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఫుడ్ పాయిజనింగ్ వంటి సాధారణ సమస్యలు కనిపిస్తాయి. కాబట్టి, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. ఈ కాలంలో కొన్ని పదార్థాలు తప్పక తీసుకోవాలి. అలాగే కొన్నింటిని దూరం పెట్టాలి.

ఏమేమి తినొచ్చు..

♦ వర్షాకాలంలో జీర్ణశక్తి మందగిస్తుంది. కాబట్టి, తేలికైన, సులభంగా జీర్ణమయ్యే తక్కువ వేయించిన ఆహారాన్ని తీసుకోవాలి.

♦ గోరువెచ్చని నీరు, అల్లం టీ, తులసి కషాయం లాంటివి జీర్ణవ్యవస్థకు ఉపశమనం కలిగించి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

♦ కాలానుగుణంగా దొరికే పండ్లు కూడా శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి.

♦ పెరుగు, మజ్జిగ వంటి ప్రోబయోటిక్ ఆహారాలు.. పేగు ఆరోగ్యానికి మేలుచేసే బ్యాక్టీరియాను పెంచుతాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

♦ రోగ నిరోధక శక్తిని పెంచే పసుపు కలిపిన పాలు, తులసి, అల్లం, వెల్లుల్లి, ఉసిరి లాంటి వాటిని విరివిగా తీసుకోవాలి.

వీటికి దూరం..

♦ చాట్, పకోడా, పానీపూరి లాంటి స్ట్రీట్ ఫుడ్స్ వర్షాకాలంలో బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్లు పెంచే ప్రదేశాలుగా మారతాయి. కాబట్టి, వీటికి దూరం ఉండాలి.

♦ పకోడీలు, సమోసాలు, చిప్స్ వంటి వేయించిన ఆహారాలు, ఎక్కువ కారంగా ఉండే పదార్థాలు జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.

♦ ఇతర కాలాల్లో ఆరోగ్యానికి మేలుచేసే ఆకుకూరలు, వర్షాకాలంలో అనారోగ్యానికి కారణం కావొచ్చు.

♦ పాలకూర, మెంతికూర వంటి ఆకుకూరల్లో సూక్ష్మక్రిములు, మట్టి కణాలు చేరే అవకాశం ఉంటుంది. వీటిని శుభ్రంగా కడిగి.. బాగా ఉడికించిన తర్వాతే తినాలి.


♦ పచ్చి కూరగాయలు, సలాడ్లను తగ్గించాలి.

♦ వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల చేపలు, రొయ్యలు లాంటివి త్వరగా పాడవుతాయి. వీటిని తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి, వర్షాకాలంలో వీటిని దూరం పెట్టాలి.

నటుడు వెంకట్‌కు ప్రభాస్ సహాయం




తెలుగు ప్రేక్షకులకు ఫిష్ వెంకట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. విలన్ గ్యాంగ్‌లో ఉంటూనే తన కామెడీతో, పంచ్ డైలాగ్స్‌తో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆది, అదుర్స్, గబ్బర్ సింగ్, మిరపకాయ్ లాంటి సినిమాలు అతడికి మంచి గుర్తింపును తీసుకొచ్చి పెట్టాయి. కొన్నిరోజులుగా ఫిష్ వెంకట్ ఆరోగ్యం బాగాలేదని వార్తలు వస్తున్నాయి. కిడ్నీలు దెబ్బతినడంతో కుటుంబ సభ్యులు ఆయనను హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. తన తండ్రి అనారోగ్యం గురించి చెప్తూ ఆర్థిక సాయం కావాలని ఫిష్ వెంకట్ కుమార్తె స్రవంతి ఒక వీడియో ద్వారా వేడుకుంది. ఆ వీడియో చూసిన పలువురు ప్రముఖులు కొంతవరకు సహాయం చేశారు. తాజాగా ప్రభాస్ 'ఫిష్ వెంకట్ ఆపరేషన్ బిల్స్ అన్ని తాను కడతాన'ని చెప్పినట్లు స్రవంతి మీడియా తెలిపింది. 'హీరో ప్రభాస్ టీమ్ నుంచి కాల్ వచ్చింది. ఆయన అసిస్టెంట్ అని ఒకరు కాల్ చేశారు. ఎవరైనా కిడ్నీ ఇచ్చే డోనర్‌ను వెతకండి. మీ నాన్నగారి ఆపరేషన్‌కు కావల్సిన రూ. 50 లక్షలు మేము ఏర్పాటు చేస్తాం' అని చెప్పినట్లు తెలిపింది. 'తన బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోవడంతో తన తండ్రి బ్లడ్ గ్రూప్‌కి మ్యాచ్ అయ్యే కిడ్నీ దానం చేసే దాతలు ఎవరైనా ఉంటే సాయం చేయమ'ని ఆమె వేడుకుంది.



'హరిహర వీరమల్లు' ట్రైలర్‌కు 4.7 కోట్ల వ్యూస్

పవన్ కళ్యాణ్ నుంచి చాలా కాలం తర్వాత వస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ కథానాయిక. దర్శకులు జ్యోతి కృష్ణ, క్రిష్ ఈ సినిమాను తెరకెక్కించారు. గురువారంనాడు ట్రైలర్‌ని థియేటర్లలో విడుదల చేయడంతో మంచి బజ్‌ని సొంతం చేసుకుంది. ఆన్‌లైన్‌లో కూడా రికార్డు రెస్పాన్స్‌ని ఈ ట్రైలర్ సొంతం చేసుకుంది. ఈ సినిమా తెలుగు ట్రైలర్ కేవలం 24 గంటల్లోనే 4 కోట్ల 70 లక్షలకు పైగా వ్యూస్ ని దక్కించుకుంది. ఆల్‌టైం రికార్డుగా పాన్ ఇండియా సెన్సేషనల్ సీక్వెల్ పుష్ప 2 ట్రైలర్ 4.4 కోట్లకు పైగా వ్యూస్‌తో ఉంది.



సరికొత్త పాత్రలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ సరికొత్త పాత్ర పోషించబోతున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలు ఆయన చేసుకుంటూ వెళ్తున్నారు. చాలావరకూ బ్లాక్‌బస్టర్ హిట్లు అందుకుంటున్నాయి. 2021లో విడుదలైన 'అఖండ' సినిమా నుంచి ఆయన కెరీర్ మళ్లీ ఊపందుకుంది. అఖండ తర్వాత వచ్చిన 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', డాకు మహరాజ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. తాజాగా 'అఖండ 2' సినిమాలో నటిస్తున్నారు. తన అభిమానులను ఆశ్చర్చపరిచే విధంగా బాలకృష్ణ కామెడీ రోల్‌లో నటించబోతున్నారు. ఇటీవలే ప్రకటించబడిన 'ఈ నగరానికి ఏమైంది 2' సినిమాలో బాలకృష్ణ ఓ గెస్ట్‌రోల్‌లో చేస్తున్నారని టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. .



హాలీవుడ్ నటుడు మైఖేల్ మ్యాడ్సన్ కన్నుమూత

హాలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు మైఖేల్ మ్యాడ్సన్ (67) కన్నుమూశారు. జూలై 3, 2025న కాలిఫోర్నియాలోని మాలిబులోని తన నివాసంలో కిందపడిపోయిన ఆయన్ని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. మైఖేల్ మరణానికి ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు లేవని అధికారులు తెలిపారు. మైఖేల్ మరణం పట్ల హాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వాల్టన్ గోగ్గిన్స్, బిల్లీ బాల్డ్‌విన్ వంటి సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా మైఖేల్ మాడ్సన్ కు భావోద్వేగ నివాళులు అర్పించారు. మైఖేల్ మ్యాడ్సన్ తన సుదీర్ఘ కెరీర్‌లో 71కు పైగా చిత్రాలలో నటించారు. దిగ్గజ దర్శకుడు క్వెంటిన్ టరాన్టినో దర్శకత్వంలో వచ్చిన 'రిజర్వాయర్ డాగ్స్', 'కిల్ బిల్' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో వచ్చిన 'నిశబ్దం' సినిమాలో కీలక పాత్రలో నటించారు.

సెకండ్ షెడ్యూల్‌కి 'ఎన్‌సి-24'

నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకత్వంలో 'ఎన్‌సి-24' అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాని సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ మిథికల్ యాక్షన్ థ్రిల్లర్‌లో చైతన్య మునుపెన్నడూ చేయని డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ సెకండ్ షెడ్యూల్ స్టార్ట్ అయినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. 'ఒక అడుగు ముందుకు మరో అడుగు దగ్గరగా.. రెండో షెడ్యూల్ మొదలైంది' అనే క్యాప్షన్ జోడించారు.



ఇంగ్లండ్‌ను కూల్చిన సిరాజ్

- **ఆరు వికెట్లతో సత్తా చాటిన హైదరాబాదీ పేసర్**
- **బ్రూక్, స్మిత్ భారీ శతకాలు**
- **244పరుగుల ఆధిక్యతలో భారత్**



బర్మింగ్‌హామ్: రెండోటెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. మూడోరోజు ఆటలో భాగంగా తొలి రెండు సెషన్లలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించగా.. టీ విరామం తర్వాత భారత బౌలర్లు చెలరేగారు. ముఖ్యంగా హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ లోయర్ ఆర్డర్‌లో ముగ్గురిని డకౌట్ చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. దీంతో భారతజట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 180పరుగుల ఆధిక్యత లభించింది. తొలిసెషన్‌లో వరుసగా రెండు వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు.. తర్వాత ఆ పట్టును నిలుపుకోలేకపోయారు. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 77పరుగులతో మూడోరోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ బ్యాటర్ రూట్(22), కెప్టెన్ బెన్ స్టోక్స్(0) వికెట్లను మహ్మద్ సిరాజ్ పడగొట్టాడు. రెండు వరుస బంతుల్లో వీరిద్దరినీ ఔట్ చేశాడు. ఆ సమయానికి ఇంగ్లండ్ జట్టు 84/5 పరుగులుగా ఉంది. ఆ తర్వాత యువ ఆటగాళ్లు బ్రూక్, వికెట్ కీపర్ స్మిత్ భారీ శతకాలతో కదం తొక్కి.. ఆరో వికెట్‌కు 303 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇంగ్లండ్ స్కోర్ 387పరుగులకు బ్రూక్ ఔటయ్యాడు. తొలి సెషన్ భారత బౌలర్లు ఆరంభంలోనే విరుచుకుపడి ఇంగ్లండ్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చినప్పటికీ, అసాధారణ పోరాటంతో బ్రూక్-స్మిత్ జట్టును ఆదుకున్నారు. భారత తొలి ఇన్నింగ్స్ భారీ స్కోరుకు దీటుగా బదులిస్తూ, తమ జట్టును పటిష్ట స్థితిలో నిలిపారు. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో... తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఒకానొక దశలో 84 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆరో వికెట్‌కు హ్యారీ బ్రూక్-జేమీ స్మిత్ అద్భుతంగా పోరాడారు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి, అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ముఖ్యంగా స్మిత్ కేవలం 169 బంతుల్లోనే 19 ఫోర్లు, 3 సిక్సర్లతో 157 పరుగులు సాధించడం విశేషం. బ్రూక్ కూడా నిలకడగా ఆడి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీ విరామానికి ఇంగ్లండ్ 5 వికెట్ల నష్టానికి 355 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. ఆ సమయానికి ఇంగ్లండ్ జట్టు భారత్ స్కోరుకు ఇంకా 232 పరుగులు వెనుకబడి ఉంది. టీ విరామం తర్వాత కొత్త బంతి అందుకున్న ఆకాశ్ దీప్ తొలి బ్రేక్ ఇచ్చాడు. బ్రూక్(158)ను బౌల్డ్ చేశాడు. దీంతో భారత ఫీల్డర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయానికి ఇంగ్లండ్ 184ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 392పరుగులు చేసింది. ఆ తర్వాత మహ్మద్ సిరాజ్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు కర్సే, టంగ్, బషీర్‌లను డకౌట్ చేయడంలో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 407పరుగుల వద్ద ముగిసింది. సిరాజ్(6/70), ఆకాశ్ దీప్(4/88) బౌలింగ్‌లో మెరిసారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారతజట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. జైస్వాల్(24) పెవీలియన్‌కు చేరగా.. కెఎల్ రాహుల్(28), కరణ్ నాయర్(1) క్రీజ్‌లో ఉన్నారు. భారత్ 244 పరుగుల ఆధిక్యతలో ఉంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్: 587పరుగులు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) కరణ్ నాయర్ (బి)సిరాజ్ 19, డకెట్ (సి)శుభ్‌మన్ (బి)ఆకాశ్‌దీప్ 0, పోప్ (సి)రాహుల్ (బి)ఆకాశ్‌దీప్ 0, రూట్ (సి)పంత్ (బి)సిరాజ్ 22, బ్రూక్ (బి)ఆకాశ్‌దీప్ 158, స్టోక్స్ (సి)పంత్ (బి)సిరాజ్ 0, జామీ స్మిత్ (నాటౌట్) 184, వోక్స్ (సి)కరణ్ నాయర్ (బి)ఆకాశ్ దీప్ 5, కర్సే (ఎల్‌బి)సిరాజ్ 0, టంగ్ (ఎల్‌బి)సిరాజ్ 0, బషీర్ (బి)సిరాజ్ 0, అదనం 19. (89.3ఓవర్లలో ఆలౌట్) 407 పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/13, 3/25, 4/84, 5/84, 6/387, 7/395, 8/396, 9/407, 10/407 **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 20-2-88-4, సిరాజ్ 19.3-3-70-6, ప్రసిధ్ కృష్ణ 13-1-72-0, నితీశ్ 6-0-29-0, జడేజా 17-2-70-0, సుందర్ 14-0-73-0.

మూడోరౌండ్‌కు సినర్, షెల్టన్

రెండోరౌండ్ దాటని డ్రాపర్, పాల్
వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సినర్, 10వ సీడ్, అమెరికాకు చెందిన షెల్టన్ మూడోరౌండ్‌కు చేరారు. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ పోటీల్లో సిన్నర్ 6-1, 6-1, 6-3తో ఆస్ట్రేలియాకు చెందిన యువిక్‌ను, షెల్టన్ 6-2, 7-5, 6-4తో ఆసీస్‌కే చెందిన హిజకలాను చిత్తుచేశారు. ఇక 13వ సీడ్, అమెరికాకు చెందిన టామీ పాల్, 4వ సీడ్, బ్రిటన్‌కు చెందిన డ్రాపర్ అనూహ్యంగా రెండోరౌండ్ గండం దాటలేకపోయారు. టామీ పాల్ 6-1, 5-7, 4-6, 5-7తో ఆస్ట్రియాకు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారుడు ఆఫ్నర్ చేతిలో, డ్రాపర్ 4-6, 3-6, 6-1, 4-6తో క్రొయేషియాకు చెందిన సిలిక్ చేతిలో ఓటమిపాలయ్యారు.

యాస్ట్రిమెస్కా, స్వైటెక్, క్రేజికోవా కూడా...

మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్, 17వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రేజికోవాతోపాటు తొలిరౌండ్‌లో కోకో గాఫ్‌కు ఝలక్ ఇచ్చిన యాస్ట్రిమెస్కా మూడోరౌండ్‌కు చేరారు. 8వ సీడ్ స్వైటెక్ 5-7, 6-2, 6-1తో మెక్నలీ(అమెరికా)పై, క్రేజికోవా 6-4, 3-6, 6-2తో అమెరికాకే చెందిన డోలెహెడెపై విజయం సాధించారు. ఇక 23వ సీడ్ టౌసన్(అమెరికా) 6-3, 7-6(12-10)తో కలినస్కయా(రష్యా)పై, 16వ సీడ్, ఆస్ట్రేలియాకు చెందిన కసట్కినా 6-2, 4-6, 6-1తో జర్మనీకి చెందిన బెగూపై, యాస్ట్రిమెస్కా(ఉక్రెయిన్) 5-7, 7-5, 7-6(10-8)తో జకరోవా(రష్యా)పై, 19వ సీడ్, రష్యాకు చెందిన సంసునోవా 6-2, 6-1తో ఉక్రెయిన్‌కు చెందిన స్టబస్టివాను చిత్తుచేశారు. ఇక 28వ సీడ్ కెనిన్(అమెరికా) అనూహ్యంగా రెండోరౌండ్‌లో ఓటమిపాలైంది. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో కెనిన్ 1-6, 6-7(4-7)తో బౌంజాస్ చేతిలో ఓటమిపాలైంది. ఇక 30వ సీడ్, నస్కోవా(చెక్) 7-6(8-6), 7-5తో రఖిమోవా(రష్యా), 13వ సీడ్ అనిషిమోవా(అమెరికా) 6-3, 5-7, 6-3తో గఫీ(నెదర్లాండ్స్)ను చిత్తుచేయగా.. 6వ సీడ్ కీస్ 3-6, 3-6తో సెగ్మోండ్(జర్మనీ) చేతిలో ఓడింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68